J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74
నెల్లూరు, 30.10.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 22 పేజీలు : 12, వెల : ₹ 5




లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerpatrika.com

# ఆశల పల్లకిలో కమలదళం

▶ ఆంధ్రలో అధికారానికి భాజపా వ్యూహం..!

▶ అభివృద్ధిని విడిచి రాజకీయ సాము చేస్తే.. ఇది సాధ్యమేనా?

**"ఆంధ్రాకి స్పెషల్ స్టేటస్(ప్రత్యేకహోదా) ఇవ్వం. పోలవరానికి నిధులు కేటాయించం. శాసనసభలో ఆమోదించి పంపిన తీర్మానాలను పెద్దలసభలో అడ్డుకుంటాం. ఆంధ్రాలో అభివృద్ధి జరగనివ్వం.... కానీ రాష్ట్రంలో పార్టీని పటిష్ఠ పరుస్తాం. ప్రతి జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయాలను ప్రారంభిస్తాం. పవన్ కళ్యాణ్ ద్వారా కాపులకు వలవేస్తాం. జగన్‌పై అసంతృప్తి రాగాలు ఆలపిస్తున్న రెడ్డి సామాజిక వర్గాన్ని మా వైపుకు తిప్పుకుంటాం. చంద్రబాబుతో కలవం.. పొత్తులకు తావివ్వం. ఆంధ్రాలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం.." అంటోంది కమలదళం.**

ఇది సాధ్యమేనా..?

వారి ఆశలు నెరవేరేనా...??

సమీప భవిష్యత్తులో కమలదళం తెలుగు రాష్ట్రాలలో అధికార పగ్గాలు చేపట్టేనా..??? ... ఇవి కనీస రాజకీయ జ్ఞానం లేని అతి సామాన్యుడి నుండి కూడా వినిపిస్తున్న ప్రశ్నలు.

మొన్న ఆదివారం అక్టోబర్ 25వతేదీ, బెజవాడలో భారతీయజనతాపార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... ఆంధ్ర ప్రదేశ్‌లో తమ పార్టీ పునాదులను పటిష్టం చేసుకుంటోందని అధికారం చేపట్టే దిశగా ముందుకు నడుస్తోందని అన్నాడు. అయితే, ఆయన చెప్పినట్టుగా బీజేపీ రాష్ట్రంలో ఏ విధంగా పునాదులు పటిష్టంగా వేసుకుంటున్నదో అర్ధంగాక రాజకీయ మేధావులు సైతం తలపట్టుకుంటున్నారు. ఇదేనా భారతీయ జనతాపార్టీ రాజకీయ వ్యూహమని విశ్లేషకులు నివ్వెరపోతున్నారు.

హిందుత్వాన్ని భుజాన మోస్తున్న మతతత్వ పార్టీగా భాజపా ఇప్పటికే అన్ని వర్గాల ప్రజల మనస్సులలో పాతుకుపోయింది. బలమైన హిందుత్వ పార్టీగా ఉత్తరభారత దేశ ప్రజల మనసులు దోచుకుంది కూడా. అయితే దక్షిణ భారత దేశంలో కూడా హిందుత్వాన్నీ ప్రజలు బాగానే ఆరాధిస్తారు. సెంటిమెంట్ల విషయానికొస్తే ఉత్తరాది వాసులకన్నా దక్షాదోళ్ళకి అవి ఎక్కువే, దక్షిణాది రాష్ట్రాలలో కనిపించినన్ని హిందూ దేవాలయాలు మనకు ఉత్తరాదిలో ఉండవు. అయోధ్యలో రామమందిర నిర్మాణం వంటి అంశం కూడా కాషాయదళంపైన కొంత సానుభూతిని చూపించడానికి మాత్రమే పనికి వస్తుంది తప్ప దక్షిణాదిలో పార్టీని గెలిపించి అధికార పగ్గాలు ఇచ్చేంత స్థాయిలో ప్రభావితం చెయ్యకపోవచ్చు. కానీ దక్షిణాది రాష్ట్రాల ప్రజలు సెంటిమెంటుతో పాటు డెవలప్మెంటును కూడా చూస్తారు. సామాజిక వర్గాల ప్రభావం కూడా పార్టీల గెలుపోటములపై ఎక్కువగానే ఉంటుంది, తాము ఏదైనా వ్యక్తిని కానీ లేదా పార్టీని కానీ నమ్మితే వాటి ఫలితం ఎలా ఉంటుందనడానికి గతంలో తమిళనాడుతోపాటు, కర్నాటక, కేరళ రాష్ట్రాలలో వచ్చిన అనేక ఫలితాలతోపాటు గత ఏడాది ఆంధ్రాలో వచ్చిన ఫలితాలే పెద్ద ఉదాహరణ. మొత్తం 175లో 151 సీట్లను జగన్ పార్టీకి కట్టబెట్టారు.

అంతటి స్థాయిలో ప్రజల విశ్వాసాన్ని భారతీయ జనతా పార్టీ సాధించాలంటే హిందుత్వ మంత్రం మాని అభివృద్ధి జపం చెయ్యాలి. అనాధగా మారిన ఆంధ్రాకి వరాల జల్లు కురిపించాలి. జగన్మోహన్ రెడ్డికి పేరు రావడం ఇష్టం లేకపోతే మొన్న విజయవాడలో జరిగిన వంతెన ప్రారంభోత్సవంతో పాటు ఇతర అనేక రహదారుల శంకుస్థాపనలు తమ ఘనతే అంటూ (మిగతా 10వ పేజీలో)



కీ॥శే॥ శ్రీమతి వేమిరెడ్డి శ్యామలమ్మ గారు

నిర్యాణం: 01-11-2013

7వ వర్ధంతి



అనురాగమూర్తి... ఆత్మీయదీప్తి...

అమ్మ

ఆమె ప్రేమానురాగాలే మాకు స్ఫూర్తి

ఆమె నడిపించిన బాటే మాకు కీర్తి

కుమారుడు

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

రాజ్యసభ సభ్యులు

• రాజా గారికి రాజయోగం

# ఎస్‌వీబీసి ఛైర్మన్‌గా సాయికృష్ణ యాచేంద్ర



సంగీతగేయధార ప్రయోగాత్మకంగా సంగీత సాహిత్య రంగాలకు పరిచయం చేసిన ఘనాపాటి, వందలాది పాటలను రాసి, పాడి... క్యాసెట్ల రూపంలో అందించిన సంగీత జ్ఞాని సాయికృష్ణ యాచేంద్రను తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో నడిచే శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ (ఎస్‌వీబీసి)కి ఛైర్మన్‌గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించింది. అక్టోబర్ 28వ తేదీ నియామకాన్ని ఖరారుచేస్తూ జిఓ విడుదలచేసింది. రెండు సంవత్సరాల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు.

రాజ కుటుంబీకుడైన సాయికృష్ణ యాచేంద్ర తన విద్యార్థిదశ నుండే సంగీత సాహిత్య రంగాల పట్ల ఆసక్తి కనపరిచేవాడు. ఆయన స్వంతంగా రూపొందించిన సంగీత గేయధారను ఇప్పటికి 400కుపైగా ప్రదర్శనలతో ప్రపంచమంతా వినిపించాడు. పలు అంశాలపైనా ఆయన పరిశోధనలు చేశాడు. ఇప్పుడు వెంకటేశ్వర భక్తి ఛానల్ ఛైర్మన్‌గా ప్రభుత్వం ఆయనను నియమించి ప్రభుత్వం ఆయనకు సముచిత స్థానం కల్పించింది. సంగీత, సాహిత్య, ఆధ్యాత్మిక రంగాలలో అపార అనుభవం ఉన్న ఆయన పర్యవేక్షణలో ఛానల్‌లో సంచలనాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న స్వామివారి భక్తులకు ఈ ఛానల్‌ని మరింత చేరువచేసే అవకాశం ఇప్పుడు ఆయనకి లభించింది. స్వామివారి పాదాలచెంత రాజయోగం దక్కించుకున్న రాజా వారికి 'లాయర్' అభినందనలు.

# జిల్లా పోలీసుశాఖకు మరో ప్రతిష్టాత్మక పురస్కారం

## - ఎస్పీ భాస్కర్ భూషణ్‌కు ప్రశంసలు



నెల్లూరుజిల్లా పోలీసుశాఖ సేవలు ఉత్తమంగా ఉంటూ జాతీయస్థాయిలో గుర్తింపు పొందుతున్నాయి. ఇప్పటికే దక్షిణ భారతదేశంలోనే విశిష్టమైన ఐఎస్‌ఓ 9001 సర్టిఫికెట్‌ను అందుకున్న జిల్లా పోలీసుశాఖ తాజాగా జాతీయస్థాయిలో మరో ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకుంది. జిల్లా ఎస్పీగా భాస్కర్ భూషణ్ నియమితులైనప్పటినుంచి జిల్లా పోలీసుశాఖ సాంకేతికపరంగా ఎంతో అభివృద్ధి చెందుతోంది. ఈ ఏడాది మార్చి నుంచి డైనమిక్ ఈబీట్స్ వ్యవస్థను అమలుచేస్తున్నారు. ఈ ప్రక్రియ జాతీయస్థాయిలో మంచి గుర్తింపు పొందడం విశేషం. స్కోచ్ గ్రూప్ సంస్థ ఈనెల28న ఢిల్లీలో వివిధ రంగాల్లో విశిష్టసేవలందించినవారికి స్కోచ్ అవార్డులను బహుకరించింది. 'టెక్నాలజీ అడాప్షన్ ఇన్ పోలీస్ ఫర్ డైనమిక్ ఈ బీట్స్' ప్రక్రియను అత్యద్భుతమైన రీతిలో అమలుచేస్తున్న జిల్లా పోలీసుశాఖకు స్కోచ్ సిల్వర్ అవార్డు లభించడం జిల్లాకే గర్వకారణం. అధునాతన సాంకేతికపరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రజలకు సత్వర సేవలు అందజేసేందుకు కృషిచేస్తున్న మన జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్‌ను ఈ సందర్భంగా పోలీసుశాఖలోని ఉన్నతాధికారులు అభినందిస్తున్నారు.

'వైయస్సార్ జలకళ'కు

# 2340 కోట్లు

రాష్ట్రంలో రైతుల కష్టాలు తీర్చేందుకు వైయస్సార్ జలకళ పథకాన్ని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అమలుచేస్తున్నారని, ఈ పథకం కింద రాష్ట్రంలో రెండు లక్షల బోర్లు వేసే లక్ష్యంతో ఈ పథకానికి 2340 కోట్లు కేటాయించారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఐటి శాఖల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి చెప్పారు. ఈనెల 28న ఆత్మకూరులోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద వైయస్సార్ జలకళ వాహనాన్ని మంత్రి ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు సుభిక్షంగా పంటలు పండించుకునేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. లబ్ధిదారులైన రైతులు తమ పేర్లను సచివాలయాల ద్వారా నమోదు చేసుకోవాలని చెప్పారు. రైతు బాంధవుడైన దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి కృషి ఫలితంగానే సోమశిల హైలెవల్ కెనాల్‌కు పునాది పడిందని, ఇటీవలనే ఆ కాలువ పనులు వేగవంతం చేసేందుకు సిఎం జగన్మోహన్ రెడ్డి అధికారులకు ఆదేశాలిచ్చారని తెలిపారు. ఈ కెనాల్ పూర్తయితే ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలతో పాటు ప్రకాశం జిల్లాలోని పలు గ్రామాలకు కూడా ప్రయోజనం చేకూరుతుందన్నారు.

డిగ్రీ ఫలితాల్లో

# బిజిఆర్ విజయభేరి



వివిఎస్‌యు విడుదల చేసిన డిగ్రీ ఫలితాల్లో నెల్లూరులోని బెజవాడ గోపాలరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు విజయభేరీ మోగించారు. 99 శాతం ఉత్తీర్ణతతో తమ సత్తా చాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి మృదుల మాట్లాడుతూ అంకితభావం కల అధ్యాపకులు, క్రమశిక్షణ కలిగిన విద్యార్థినులతోనే ఉత్తమ ఫలితాలు వచ్చాయని అందరినీ అభినందించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులందరినీ కళాశాల సెక్రటరీ-కరెస్పాండెంట్ దొడ్ల శేషారెడ్డి, ఎ.ఓ నరేష్‌లు అభినందించారు.

• పోలవరం

# ఆనాడు వరం అన్నారు... ఈనాడు భారం అంటున్నారు



పోలవరం వ్యవహారంపై మాజీ ఎంపి ఉండవల్లి మండిపడ్డాడు. 29వ తేదీ గురువారం రాజమండ్రిలో విలేకరుల సమావేశం పెట్టిన ఉండవల్లి తన సహజ ధోరణిలో కేంద్ర ప్రభుత్వ వైఖరిపైనా, జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యంపైన విరుచుకుపడ్డాడు. పోలవరం నిర్మించాలని విభజన చట్టంలో ప్రత్యేకంగా పొందుపరచి ఆనాడు ఆంధ్రాకి అదొక వరంగా పేర్కొన్నారని, ఇప్పుడు అదే పోలవరం వారికి భారం అని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నాడు. ఈరోజు ఉపరాష్ట్రపతిగా ఉన్న వెంకయ్యనాయుడు ఆరోజు రాజ్యసభలో ఆంధ్రుల అభ్యున్నతి గురించి, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వనరుల గురించి సుదీర్ఘ ఉపన్యాసం చేశాడని, అనాథగా మారబోతున్న ఆంధ్రకు వనరులు చేకూర్చే సాధనంగా పోలవరం ప్రాజెక్టును ఆరోజు పేర్కొన్నాడని, ఇప్పుడు అదే పోలవరాన్ని నిర్లక్ష్యం చేయడం అమానుషమని అన్నాడు. పోలవరం ఆంధ్రుల హక్కని ఈ విషయంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం సక్రమంగా తన వాదనను వినిపించలేకపోతుందని ఎద్దేవా చేశాడు.

రైతులకు న్యాయం చేయకుండా..

# మాపై విమర్శలెందుకు?

## - మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



జిల్లాలో రైతులు నష్టపోతే ఆ విషయం చూడకుండా, తమపై విమర్శలు చేయడమే లక్ష్యంగా పెట్టుకోవడం ఏమిటని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వైకాపా నాయకులనుద్దేశించి ప్రశ్నించారు. ఈనెల 28న ఆయన నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈ ఎడగారు సీజన్లో జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోయారని, ధాన్యం కొనుగోళ్ళలో అక్రమాలు జరిగాయని విమర్శించారు. రైతులు పుట్టి ధాన్యాన్ని 7వేల నుంచి 10వేలలోపే అమ్ముకోవాల్సివచ్చిందని, 850 కిలోల పుట్టిని 1150 కిలోలుగా మార్చి రైతులను దోచుకున్నారని ఆరోపించారు. ఈ సీజన్‌లో రైతులు సుమారు 800కోట్ల రూపాయల దాకా నష్టపోయారన్నారు. దళారులు, మిల్లర్లు, నాయకులు రైతులను దోచుకుతిన్నారని ధ్వజమెత్తారు. గిట్టుబాటు ధరలు లభించక రైతులు నష్టపోయారని, రైతులను ఉద్ధరిస్తామని చెప్పుకునే ప్రభుత్వం రైతులకు న్యాయం చేయలేదా అని ఆయన ప్రశ్నించారు. రైతులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వమే వారిని ముంచేస్తుంటే తాము ప్రశ్నించడం తప్పా?..అని ఆయన అంటూ రైతులకు న్యాయం చేయాలన్నారు. ధాన్యం కొనుగోళ్లలో నిష్పాక్షికంగా విచారణ జరిపించాలని ఆయన కోరారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు 15వేల వంతున పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, టిడిపి నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

## కాలధర్మం



# వీరిశెట్టి చంద్రశేఖరరావు(శేఖర్)

నెల్లూరులోని మురళీకృష్ణ గ్రూప్ ఆఫ్ హోటల్స్ నిర్వహణా సారధి హజరత్‌బాబుకు సమీప బంధువు, ఆయనకు కన్నబిడ్డలా అన్నీతానై చేదోడువాదోడుగా వుంటూ వచ్చిన వీరిశెట్టి చంద్రశేఖర్‌రావు(51) (శేఖర్) ఈనెల 28న కన్నుమూశాడు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. శేఖర్‌గా అందరికీ సుపరిచితుడైన ఆయన ఆరడుగుల ఆజానుబాహుడు. ఆయనెప్పుడూ అందరిని స్నేహపూర్వకంగా పలకరించేవాడు. గానగంధర్వుడు మన బాలూ గారి కుటుంబానికి శేఖర్ ఎంతో సన్నిహితుడు. బాలు గారు మరణించినప్పుడు కూడా ఆయన మద్రాసుకు వెళ్ళి ఆయన కుటుంబసభ్యులకు అవసరమైన పనులన్నీ చేసిపెట్టాడు. అక్కడినుండి వచ్చిన వారంలోపే ఆయనలో కరోనా లక్షణాలు బయటపడ్డాయి. నెల్లూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో అప్పటినుండి చికిత్స పొందుతున్నాడు. కరోనా తగ్గినట్లే తగ్గి మళ్ళీ తిరగబెట్టడంతో బుధవారం ఉదయం తుదిశ్వాస విడిచాడు. నెల్లూరులో బాలుకి హజరత్‌బాబు కుడి భుజమైతే, హజరత్‌బాబుకి శేఖర్ వెన్నెముక లాంటివాడు. అలాంటి శేఖర్ కరోనా కాటుకి బలికావడం దురదృష్టకరం.. బాధాకరం. శేఖర్ మృతికి సంతాపం ప్రకటిస్తూ ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది.. 'లాయర్'!...

# అల్లంపాటి విజయవర్ధన్‌రెడ్డి



మినర్వా హోటల్స్ అధినేతగా పేరుగడించిన అల్లంపాటి విజయవర్ధన్‌రెడ్డి(62) ఈనెల 23వ తేది హైదరాబాద్‌లోని తన నివాసంలో కన్నుమూశాడు. గత కొన్నిరోజులుగా ఆయన తీవ్ర అస్వస్థతతో బాధపడుతుండినాడు. అల్లూరులోని రామకృష్ణా విద్యాసంస్థలకు కరెస్పాండెంట్ మరియు సెక్రటరీగా విశేష సేవలందించడమే కాకుండా, అల్లూరులోని ప్రసిద్ధమైన శ్రీ రామాలయానికి శాశ్వత ధర్మకర్తగా దేవస్థానాన్ని అభివృద్ధి చేశాడు. అల్లూరులోని రామకృష్ణా విద్యాసంస్థలు, రామాలయం ఆయనకు రెండుకళ్ళుగా ఉండేవి.

మినర్వా హోటల్స్, బ్లూఫాక్స్ రెస్టారెంట్ల మేనేజింగ్ డైరెక్టర్‌గా ఆయన ఆతిథ్యరంగంలో ఎంతో నాణ్యమైన సేవలందించాడు. హైదరాబాద్ అబిడ్స్ ప్రాంతంలో నాలుగు దశాబ్దాలుగా ఎంతో ప్రఖ్యాతిగాంచిన 'ప్యాలెస్ హైట్స్' రెస్టారెంట్ ఆయన రూపకల్పన చేసిందే! ప్రత్యేకించి మినర్వా హోటల్స్ గ్రూప్ అధినేతగా వ్యాపార సామ్రాజ్యంలో మంచి పేరు గడించాడు. అల్లూరోళ్ళంటే ఆయనకెంతో అభిమానం. ఎంతోమందికి ఆయన తన హోటల్స్‌లో ఉద్యోగాలిచ్చాడు. అల్లూరు ప్రాంతంలో విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేశాడు. తమ వద్ద పనిచేసే కార్మికులు, ఉద్యోగుల బాగోగుల పట్ల శ్రద్ధ తీసుకునేవాడు.

ఆయన మృతి సమాచారం తెలుసుకున్న మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, ఆయన భాగస్తుడు, బంధువు, నైశ్రాయ్ హోటల్స్ అధినేత ప్రభాకర్‌రెడ్డి తదితరులు వెళ్ళి ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

విపిఆర్ ఫౌండేషన్ సి.ఇ.ఓ, విక్రమ సింహపురి యూనివర్శిటీ ప్రారంభ రిజిస్ట్రార్, విజయవర్ధన్‌రెడ్డి సహాధ్యాయి ప్రొఫెసర్ నారాయణరెడ్డి కూడా తన మిత్రుడి మృతికి సంతాపం ప్రకటించాడు. విజయవర్ధన్‌రెడ్డి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### నగర కార్పొరేషన్‌లో మార్వాడి వడ్డీతో వార్డు సచివాలయాల ద్వారా పన్నులు గుంజుతున్నారు.

### వసూళ్ళే కాదు... ప్రజల కష్టాలూ చూడండి! సమస్యల పరిష్కార బాధ్యతను కూడా...

# వాలంటీర్లకే అప్పజెప్పండి



పబ్లిక్ డిమాండ్

నెల్లూరు నగరాన్ని సమస్యలే లేని నగరంగా తీర్చిదిద్దుతామని ఒక వైపు నాయకులు మరోవైపు అధికారులు తరచూ చెప్తూనే వున్నారు. చాలా సంతోషం, రాజకీయ పాలకవర్గం లేకపోయినప్పటికి ఇతర నేతలూ, అధికారులూ అభివృద్ధిపై ఆసక్తి చూపడం ఆనందదాయకం. ఇటీవల కార్పొరేషన్‌కి బాకీ ఉన్న ఇంటి పన్ను బకాయిలను వసూలుచేసే బాధ్యతలను గ్రామ సచివాలయాలకు అప్పజెప్పారు, పాపం వాలంటీర్లుకూడా ఇంటింటికీ తిరిగి మొండిబకాయిలను సైతం వసూలు చేసి మునిసిపల్ కార్పొరేషన్ ఖజానా నింపుతున్నారు.

గడువు దాటిపోయినా పన్ను చెల్లించని వారి దగ్గరనుండి మార్వాడీల తరహాలో రెండు రూపాయల వడ్డీ వేసి ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం ఎవరికైనా బాకీ ఉంటే ఆ మొత్తానికి బ్యాంకు వడ్డీ వేసి చెల్లిస్తారు. కొన్ని సందర్భాలలో అదికూడా ఇవ్వరు. అదే మనం వాళ్లకి బాకీ ఉంటే మాత్రం పెనాల్టీ రూపంలో రెండు రూపాయల వడ్డీ వేసి మరీ వసూలుచేస్తారు. ఒక్క నెల్లూరు కార్పొరేషన్‌కే వడ్డీ రూపంలో లక్షలు వస్తున్నాయంటే ఇక రాష్ట్రం మొత్తంలో ఎంత పిండుతున్నారో అర్థం చేసుకోవచ్చు.

వసూళ్ల మీద చూపించే శ్రద్ధ ప్రజల అవసరాలు పట్టించుకోవడంలో కూడా చూపిస్తే బాగుంటుంది. నగరంలో సగానికి పైగా రోడ్లు పరమ దరిద్రంగా ఉన్నాయి. వర్షాలు రాకముందే గుంటలమయమై బురదతో నిండిపోయి ఉన్నాయి. ఇక దోమల సంగతి సరే చెప్పనవసరం లేదు కోట్లల్లో ఉన్నాయి. దోమల మందు కొట్టే ఫాగింగ్ యంత్రాన్ని నెల్లూరోళ్లు చూసి ఎంతకాలమయ్యిందో! మరో వైపు నగర నడిబొడ్డులో వున్న లే-అవుట్లలో సైతం ఖాళీ స్థలాల్లో నీళ్లు నిలబడిపోయి పందులకు నివాసాలై, దోమలకు ఉత్పత్తి కేంద్రాలుగా మారి దర్శనమిస్తున్నాయి. ఇక అక్రమ నిర్మాణాలకైతే నెల్లూరులో కొదవే లేదు. రోడ్లు కూడా ఆక్రమించి నిర్మాణాలు సాగిస్తుంటే నిలదీసే నాథుడే లేదు. ఇలాంటి వాటివైపు అధికారులు దృష్టి సారిస్తే బాగుంటుంది.

గత ప్రభుత్వంలో కొందరు పరపతి ఉన్న నాయకులు వాళ్ళే కాంట్రాక్టర్లుగా మారి నగరాన్ని నాశనం చేశారు. తమకు ఎక్కడ ఎక్కువ డబ్బులు మిగులుతాయో అక్కడే దృష్టి పెట్టి అవసరమైన ప్రదేశాలను గాలికి వదిలేసి అవసరం లేని చోట్లల్లో రోడ్లు, కాలువలు కట్టేశారు. కొన్ని చోట్లయితే పన్నులు కట్టిన ప్రజలను గాలికి వదిలేసి వాళ్ళ ఇంటివరకే రోడ్డును వేసుకున్న ఘనులు వాళ్ళు. బాగా అభివృద్ధి చెంది ఇళ్ళ నిర్మాణం జరిగివున్న కాలనీలను వదిలేసి, అసలు ఇళ్ళే లేని చోట్ల కూడా రోడ్లు వేసేశారు. ప్రభుత్వం మారి ఏడాదిన్నర కావొస్తోంది, నాయకులూ మారారు, అధికారులూ మారారు. బహుశా పలుకుబడి ఉన్నవాళ్ళు కాబట్టి కాంట్రాక్టర్లు మారరేమో..! ఇప్పుడైనా ప్రజల సమస్యలమీద వారు దృష్టి పెట్టాలి. నడ్డివిరిగే వడ్డీతో పన్నులు వసూలు చేసే భారాన్ని మోస్తున్న వాలంటీర్‌లకే ప్రజల కష్టాలు తెలుసుకునే బాధ్యతలను కూడా అప్పజెప్పండి. గ్రామ/వార్డు సచివాలయాల వేదికగా వాళ్ళు నిత్యం ప్రజలతో మమేకమై ఉంటున్నారు, పెన్షన్లను అందిస్తున్నారు. రేషన్ సక్రమంగా అందేలా చూస్తున్నారు, ప్రభుత్వ సంక్షేమ పథకాల సారాంశాన్ని ప్రజలకు వివరిస్తున్నారు, కాబట్టి ప్రజల కష్టాలను కూడా వాళ్ళు బాగా గుర్తించగలరు. ప్రజలు కూడా నిత్యం వాళ్ళతో టచ్‌లోనే ఉంటారు కాబట్టి వాలంటీర్ వ్యవస్థ ద్వారా తమ కష్టాలను, బాధలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్ళడానికి ఇష్టపడతారు. నాయకులూ, అధికారులూ ఎప్పుడో వస్తారు. అదే సచివాలయ వాలంటీర్లయితే ఎప్పుడూ వస్తూనే ఉంటారు. ప్రజల సమస్యలు తెలుసుకుని అవి తీర్చడానికి వాలంటీర్లు కృషి చేస్తారు కాబట్టి, ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వ బకాయిలు వసూలు చేసే స్వతంత్రం కూడా వారికి ఏర్పడుతుంది. ఈ విధంగానైనా అస్తవ్యస్తంగా ఉన్న నెల్లూరు నగర కార్పొరేషన్ గాడిన పడుతుంది. కాబట్టి వాలంటీర్లనే సేవకులుగా మార్చండి. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులుగా వారి సేవలను మరింత విస్తృతపరచి నగర భవిష్యత్తును వారి చేతిలో పెట్టండి. బాదడంలోనే కాదు బాధల్లో కూడా వాలంటీర్లను బాధ్యులని చెయ్యండి.

**- సంచారి**






# పెద్దోళ్లొచ్చారు.. క్లాసుపీకి వెళ్లారు!



- అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు
- ఆధిపత్య వ్యవహారాలపై ఆరా తీశారు



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు, పార్టీ జిల్లా రీజినల్ సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి, ఆయనతోపాటు కరెంటు మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అక్టోబర్ 27వతేదీ మంగళవారం నెల్లూరు కొచ్చారు. ఆర్ & బి అతిథి గృహంలో జరిగిన సమీక్షా సమావేశంలో ముందుగా జిల్లాలోని శాసన సభ్యులందరినీ పిలిపించుకుని మాట్లాడారు.

పార్టీలో అంతర్గతంగా జరుగుతున్న ఆధిపత్య పోరు, వర్గ విభేదాలు వంటి అంశాలపై ఆరా తీశారు. ఎక్కడైనా పార్టీకి చెడ్డపేరు వస్తే అది ఎవరికీ మంచిది కాదని క్లాసుపీకారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తెస్తున్నారని, మరోవైపు వర్గ విబేధాలు, ఆధిపత్య పోరు, అంతర్గత మనస్పర్థలతో పార్టీకి చెడ్డపేరు వస్తుందని, తమ వ్యవహారశైలి మార్చుకుని పార్టీ పటిష్టత కోసం కూడా చిత్తశుద్ధితో అందరూ కలిసి పనిచేయాలని హితవు పలికారు.

### ఒక్కొక్క నియోజకవర్గంపై విడివిడిగా సమీక్ష ..

జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, ఎస్‌పి భాస్కర్‌భూషణ్‌తో పాటు మరికొన్ని ముఖ్య విభాగాల అధికారులను కూర్చోబెట్టుకుని వారి ఎదురుగా ఒక్కొక్క శాసనసభ్యుడిని పిలిచి ఆయా నియోజకవర్గాలలో జరిగిన అభివృద్ధి, ఇంకా చేపట్టవలసిన సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. ఒకరు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో మరొక శాసనసభ్యుడి జోక్యం... తద్వారా అధికారులకు కలుగుతున్న ఇబ్బంది తదితర అంశాలపై కూడా అధికారులకు, శాసనసభ్యులకు స్పష్టమైన క్లారిటీ ఇచ్చినట్టు తెలిసింది. ఇకపై ఎలాంటి వివాదాలు లేకుండా అందరూ సమిష్టిగా చర్చించుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారని సమాచారం. మొత్తంమీద చాలారోజులకి రాష్ట్ర పార్టీ జిల్లాపై దృష్టిపెట్టింది. భవిష్యత్తులో పార్టీ మరింత పటిష్టంగా ముందుకు వెళ్ళడానికి ఇలాంటి సమీక్షలు చాలా అవసరం కూడా!

### సంక్షేమంపై సంతోషం...

సమీక్షల అనంతరం నాయకులు మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజాసంక్షేమ కార్యక్రమాలు సంతృప్తికరమైన రీతిలో ఉన్నాయని సంతోషం వ్యక్తం చేశారు. అధికారులు, ఎమ్మెల్యేలు బాగా పనిచేస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలను నూటికి నూరుశాతం సక్రమంగా అందజేస్తున్నారంటూ కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి మేకపాటి గౌతంరెడ్డి, వెంకటగిరి శాసనసభ్యుడు ఆనం రామనారాయణరెడ్డి మినహా మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్‌తో సహా జిల్లాకు చెందిన ఎనిమిదిమంది శాసనసభ్యులు, ఇతర కీలక నాయకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి తెలుగుదేశంపై ధ్వజమెత్తుతూ ధాన్యం కొనుగోలు వ్యవహారంలో తమపై నిరాధార నిందలు వేయడం సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి తగదని, నూటికి నూరుపాళ్ళు రైతులు సంతృప్తికరంగా ఉన్నారని, ఎక్కడా ఎలాంటి అక్రమాలు, అన్యాయం జరగలేదని అన్నాడు. అనవసరంగా తమపై నిందలు వేస్తే.. సహించబోమని హెచ్చరించాడు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళకు సంబంధించి మాజీమంత్రి సోమిరెడ్డి చేసిన ఆరోపణలపై విచారణ జరపాలని, జిల్లాలో ఈసారి రికార్డుస్థాయిలో ధాన్యం దిగుబడి వచ్చిందని, దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నుల దాకా ప్రభుత్వం కొనుగోలు చేసిందని, ఇంతగా రైతన్నలకు బాసటగా ఉన్న ప్రభుత్వాన్ని, వైకాపాను టిడిపి నాయకులు విమర్శించడంలో అర్థం లేదని అన్నాడు.

## 'ప్రభా'తం

అనాదిగా శాంతి సామరస్యాలకు ఆలవాలంగా ఉంటూ, సకల మానవాళి క్షేమాన్ని అభిలషిస్తూ.. శాంతియుత సహజీవనాన్ని, విశ్వశాంతిని మనసారా కోరుకునే దేశంగా ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తూ వస్తోంది..భారత్!.. ఒక్కమాటలో చెప్పాలంటే శాంతికి పుట్టుగడ్డ మన భారత్. సహృదయతకు, సుహృద్భావానికి నిలయం మనదేశం. అయితే పక్కనే ఉన్న పాకిస్తాన్, చైనాలు ఎంతోకాలంగా ఇది సహించలేకపోతున్నాయి. ఉగ్రవాదులను మనదేశంపైకి ఉసిగొల్పడం, భారత్‌ను అస్థిరత్వానికి గురిచేయాలని కుట్రలు పన్నడం వంటివి పాకిస్తాన్ చేస్తుంటే, దేశ సరిహద్దులను అతిక్రమిస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడుతుండడం చైనాకి అలవాటైపోయింది.అంతేకాదు చైనా గత కొద్ది నెలలుగా దుందుడు కుగా వ్యవహరిస్తూ కయ్యానికి కాలుదువ్వుతోంది. బలగర్వంతో భారత్‌ను ఉక్కిరిబిక్కిరి చేయాలనుకుం టోంది. మనదేశ సరిహద్దుల్లోనే కాకుండా, సామాజిక మాధ్యమాల ద్వారా కూడా చైనా కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. ఈ నేపథ్యంలో భారత్ కూడా అందుకు ధీటుగా స్పందిస్తోంది. సామ్రాజ్యవాద విస్తరణకు ఎప్పుడో కాలం చెల్లిపోయిందని చాటిచెప్తూ చైనా వ్యూహాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు భారత్ సమాయత్తమైంది. ఈ నేపథ్యంలో చైనా సరిహద్దు ప్రతిష్టంభన కొనసాగుతున్న వేళ.. చైనా ఆటకట్టించడానికి భారత్‌తో అమెరికా స్నేహహస్తం చాచడం, తమ వద్ద ఉన్న అత్యున్నత రక్షణ పరిజ్ఞా నాన్ని భారత్‌తో పంచు కునేదుకు అమెరికా సిద్ధం కావడం, భారత్-అమెరికా దేశాల మధ్య ఎంతో కీలక మైన రక్షణ ఒప్పందం కుదరడం శుభపరిణామం. ఇదెంతో చరిత్రాత్మకమైన ఒప్పందం కూడా. ఈ సందర్భంగా భారత్‌కు అండగా ఉంటామని అమెరికా విదేశాంగ మంత్రి మైక్ పాంపియో చెప్పడం, ఇండో పసిఫిక్ ప్రాంతంలో సుస్థిరతపై సుదీర్ఘ చర్చలు జరగడంతో పాటు, దేశ రక్షణ కోసం చేసుకుంటున్న ఈ ఒప్పందం రెండు దేశాల మైత్రీ ప్రయాణంలో ఒక గొప్ప ముందడుగని చెప్పవచ్చు. అందులోనూ అమెరికా అధ్యక్ష ఎన్నికలు ఇక కొద్ది రోజుల్లోనే ఉన్న నేపథ్యంలో ఈ కీలకపరిణామం అంతర్జాతీయంగా అన్నిదేశాల్లోనూ ఆసక్తిని కలిగిస్తోంది. ముఖ్యంగా భారత్ తన సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు చేపడుతున్న చర్యలకు అమెరికా అండగా ఉంటుందని అమెరికా విదేశాంగమంత్రి స్పష్టం చేయడం, చైనా కమ్యూనిస్టు పార్టీ నుంచి మాత్రమే కాదు, ఎలాంటి బెదిరింపులనైనా ఎదుర్కొనేందుకు భారత్ అమెరికాలు కలసికట్టుగా పనిచేస్తాయని, ఎటువంటి విపత్కర పరిస్థితుల్లోనైనా భారత్‌కు అమెరికా మద్దతునిస్తుందని చెప్పడం, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు ఇరుదేశాలు కలసికట్టుగా కృషిచేస్తాయని స్పష్టం చేయడంతో అమెరికా-భారత్ స్నేహబంధం మరింతగా పెంపొంది నట్లయింది. ప్రపంచంలోనే రెండు గొప్ప ప్రజాస్వామిక వ్యవస్థలు కలసి ఎదిగేందుకు ఇదో చక్కటి అవకాశమని, చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రపంచ స్వేచ్ఛ, భద్రతకు విసురుతున్న సవాళ్ళను ఎదుర్కొనేందుకు కరోనా సమయంలో కూడా ఇరుదేశాలు కలసి పనిచేశాయని, ఆసియా ఖండంలో శాంతిని, స్థిరత్వాన్ని ప్రోత్సహించేందుకు వీలుగా భారత్‌తో ఈ ఒప్పందం చేసుకుంటున్నట్లు అమెరికా విదేశాంగ మంత్రి స్పష్టం చేశారు కూడా.

సార్వభౌమత్వం, స్వేచ్ఛను కాపాడుకునేందుకు భారత్ చేసే ప్రయత్నాల్లో నిరంతరం వెన్నంటే నిలుస్తామని అమెరికా స్పష్టం చేసింది. దీంతో తూర్పు లద్దాఖ్‌లో బుసలు కొడుతున్న చైనాకు అమెరికా స్పష్టమైన హెచ్చరిక జారీ చేసినట్లయింది. భారత్‌కు తమ అండ ఉందన్న సంగతిని అమెరికా ఈ సందర్భంగా గుర్తు చేసింది. ఈనెల 27న ఢిల్లీలో అమెరికా-భారత్‌లు కలసి కీలకమైన నిర్ణయాలు తీసుకుంటూ 5 ఒప్పందాలు చేసుకున్నాయి. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న బేసిక్ ఎక్స్ఛేంజ్ అండ్ కోఆపరేషన్ అగ్రిమెంట్ (బెకా)పై ఇరు దేశాలు సంతకాలు చేయడం గొప్ప విశేషం. అమెరికా రక్షణమంత్రి మార్క్ ఎస్పర్, విదేశాంగ మంత్రి మైక్ పాంపియో, భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్‌తో పాటు ఉన్నతాధికారులు ఈ చర్చల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా చైనా అనుసరిస్తున్న విస్తరణవాదంపైనే ఇరుదేశాలు ప్రధానంగా దృష్టి సారించాయి. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత్ శాశ్వత సభ్యత్వానికి తాము మద్దతిస్తామని అమెరికా ఈ సందర్భంగా పునరుద్ఘాటించడం మరో గొప్ప విశేషం. ఈ ఒప్పందం ద్వారా అత్యాధునిక సైనిక సాంకేతికత, వసతి కేంద్రాలతో పాటు అంతరిక్ష సంబంధిత సమాచారాన్ని కూడా పరస్పరం వినియోగించుకునేం దుకు వీలుంటుంది. అమెరికా ఉపగ్రహాలు, అంతరిక్ష సమాచారాన్ని భారత్‌తో పంచుకునేందుకు వీలు కల్పించే నిబంధన కూడా ఈ ఒప్పందంలో ఉండడం విశేషం. ముప్పునుఎదుర్కొనేందుకు అవసరమైతే కొత్త మిత్రుల సహాయసహకారాలు తీసు కుంటూ భారత్ ముందుకు సాగుతుందని చైనా ఊహించలేదు.

ఏదేమైనా అమెరికాతో భారత్ చేసుకున్న 'బెకా' ఒప్పందం పాకిస్తాన్‌కు కూడా ఒక గట్టి హెచ్చరిక అనే చెప్పవచ్చు. బెకా ఒప్పందం వల్ల పాకిస్తాన్ మరింత బలహీనపడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ రక్షణ ఒప్పందంతో భారత్ గతంలో కంటే ఎంతో బలోపేతంగా మారుతుందని చెప్పవచ్చు. అమెరికాతో పాటు జపాన్, ఆస్ట్రేలియాలు కూడా చైనాకు వ్యతిరేకంగా, భారత్‌కు మద్దతుగా ఉంటూ చైనాను అదుపులో ఉంచేందుకు సిద్ధపడడం చైనా జీర్ణించుకోలేకపోతోంది. ఈ పరిస్థితులను అసలు చైనా ఊహించలేకపోతోంది.

భారత్ తరపున ఇన్ని దేశాలు అండగా ఉండేందుకు ముందుకు వస్తుండడం, భారత్‌తో బెకా వంటి ఒప్పందాలు చేసుకుంటుండడం చైనాకు కలవరం కలిగించే విషయాలే. చైనా ఆర్థికంగా బలంగా ఉండడంతో ఎంతోకాలం నుంచి పొరుగుదేశాలకు ముప్పుగా తయారైంది. ఇరుగుపొరుగు దేశాల భూభాగాలను ఎంతోకొంత ఆక్రమించుకోవడానికే లేనిపోని ప్రయత్నాలు చేస్తోంది. అయితే చైనా పోకడలను ఎప్పటికప్పుడు పసిగట్టి వాటిని కట్టడిచేయడం ద్వారా భారత్ తన సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకుంటూ వస్తోంది. ఆ కృషిలో భాగంగా ఇప్పుడు తాజాగా అమెరికాతో చేసుకున్న ఒప్పందం ఒక కీలక మలుపుగా భావించవచ్చు. ఇండో పసిఫిక్ ప్రాంతంలో చైనా తన ప్రాబల్యాన్ని పెంచుకోకుండా నిరోధించడంలో ఈ ఒప్పందం ఎంతో కీలకం అవుతుంది కూడా. ఏదేమైనా ఈ ఒప్పందాలన్నీ చైనా దుందుడుకుతనానికి బాగా చెక్ పెట్టే వేననడంలో ఎలాంటి సందేహం లేదు.

### చరిత్రాత్మక ఒప్పందం

చైనా ఆర్థికంగా బలంగా ఉండడంతో ఎంతోకాలం నుంచి పొరుగు దేశాలకు ముప్పుగా తయారైంది. అయితే చైనా పోకడలను ఎప్పటికప్పుడు కట్టడి చేయడం ద్వారా భారత్ తన సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకుంటూ వస్తోంది. ఆ కృషిలో భాగంగా ఇప్పుడు తాజాగా అమెరికాతో చేసుకున్న ఒప్పందం ఒక కీలక మలుపుగా భావించవచ్చు. ఇండో పసిఫిక్ ప్రాంతంలో చైనా ప్రాబల్యాన్ని నిరోధించడంలో ఈ ఒప్పందం ఎంతో కీలకం అవుతుంది. ఇదెంతో చరిత్రాత్మక ఒప్పందం కూడా!..

## బాబుకెందుకు అంత అసహనం..?

ఇటీవల ఆంధ్రాలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు చూస్తుంటే రాజకీయ వ్యవస్థ మీద ముఖ్యంగా నేతలమీద అసహ్యం వేస్తోంది. 14సంవత్సరాలు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని పరిపాలించిన తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు వ్యవహరిస్తున్న తీరు గమని స్తుంటే ఆయన పట్ల ఏహ్యాభావం కలుగుతోంది. సుదీర్ఘకాలం ముఖ్యమంత్రి పదవి వెలగబెట్టినోడు ఓ ఐదేళ్లు ప్రతిపక్షంలో కూర్చోలేడా, జగన్ అధికారపగ్గాలు చేపట్టిన పక్కరోజునుండే నువ్వు రాజీనామా చెయ్యి అంటూ అర్థం పర్థం లేని వ్యాఖ్యలు చేస్తూ ప్రజల్లో చులకనైపోతున్నాడు.

ఆయన 14 ఏళ్ళ అనుభవం నచ్చకనే కదా ప్రజలు వైసిపికి 151 సీట్లిచ్చి అధికారం అప్పజెప్పారు. 175సీట్లలో 151 సీట్లు జనం జగన్‌కి ఇచ్చారంటే ఆయనపైన వున్న అభిమానం కన్నా బాబు పైనున్న వ్యతిరేకత ఏ స్థాయిలో పని చేసిందో ఇంతటి అనుభవంగల బాబు అర్థం చెసుకోలేడా ...? ఇప్పుడు తనకున్న శక్తులన్నీ ఒడ్డి జగన్ ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలుచేయడానికి కుట్రలు చేస్తున్నాడు.

జీవితాన్ని అనుభవించాల్సిన వయసులో తనకున్న కోట్ల రూపాయల ఆస్తిని, భార్యా బిడ్డలని, అకస్మాత్తుగా భర్తను కోల్పోయిన తల్లిని వదిలి 10 సంవత్సరాల పాటు ఇంటికి దూరంగా వుంటూ ఆఖరుకి కొన్ని రాజకీయశక్తులు ఆయనను జైలు పాలు చేసినా అదరకుండా బెదరకుండా అత్యంత ఓర్పుగా సంయమనం పాటించి ప్రజల మనసు దోచుకుని, తాననుకున్నది సాధించుకున్నాడు జగన్మోహన్‌రెడ్డి. 70యేళ్లు ఉన్న చంద్రబాబులో అంత మాత్రం కూడా ఓర్పులేదా ...? నిజంగా జగన్ పరిపాలన బాబు చెప్పినంత స్థాయిలో బాగా లేకపోతే మళ్ళీ ప్రజలే తీర్పు చెప్తారు కదా. జగన్‌బాబు కన్నా చంద్రబాబే మేలని వాళ్లకి అనిపిస్తే మళ్ళీ బాబునే గెలిపిస్తారు కదా... ఇంతలోనే ఆయనలో ఎందుకంత భయం. ప్రజలు శాశ్వతంగా తనకు మంగళం పాడుతారేమో ననే అభద్రతా భావంతో వున్నాడా? అందుకే ఇంత అసహనంతో వ్యవహరిస్తున్నాడా...??

**జి.వి.సుబ్బయ్య, పిడుగురాళ్ల.**

## సాహిత్యానికి పెద్దపీట

సాహితీ పోషకులు, సాహిత్య ఆరాధకులు కరువైపోతున్న ఈ జనరేషన్‌లో సాహిత్యానికి సముచిత స్థానం కల్పిస్తూ సాహితీవేత్తలను ప్రోత్సహిస్తున్నందుకు 'లాయర్' పత్రిక వారికి నా నమస్సులు. తరచూ గ్రంథ సమీక్షలతోపాటుగా, సందర్భానుసారం కవులు రాస్తున్న కవితలకు కూడా ప్రాముఖ్యత కల్పిస్తూ పత్రికలో ప్రచురిస్తున్నారు. సాహితీ దిగ్గజాలకు నెల్లూరు పుట్టినిల్లు. తిక్కన మహాకవి, దువ్వూరు రామిరెడ్డి, ఆచార్య ఆత్రేయ, యంయస్ రెడ్డి వంటి మేధావులతోపాటు ఇంకా ఎంతోమంది సాహిత్యకారుల జన్మభూమి సింహపురి. వారం వారం నెల్లూరు విశేషాలతోపాటు విశ్వవ్యాప్తంగా ఉన్న తెలుగు సాహితీవేత్తలను కూడా ఆకర్షించే విధంగా సాహిత్యానికి కూడా ప్రాధాన్యత కల్పించడం అభినందనీయం.

**యం. యస్. సూర్యనారాయణ, విజయవాడ.**

లాయర్

పాఠకులకు మనవి

మా(మీ) లాయర్ పత్రికకు

**సమాచారం / లేఖలు**

పంపదలచిన వారు

**9866314741** నంబరుకు

వాట్స్‌యాప్ ద్వారా గాని, లేదా

lawyerpatrika@gmail.comకి

ఈ-మెయిల్ ద్వారా గాని

పంపవలసిందిగా విజ్ఞప్తి.

పోస్టల్ చిరునామా :

ప్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు,

మాగుంట లే అవుట్, నెల్లూరు - 3.

- సం/-

### నెల్లూరు నగరంలో

## ట్రాఫిక్‌ను అదుపు చెయ్యండి




నెల్లూరు నగరంలో రోజురోజుకీ ట్రాఫిక్ పెరిగిపోతోంది. పెరుగుతున్న జనాభాతో పాటు వాహనాల సంఖ్య కూడా పెరిగిపోతుండడంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారైపోయింది. ఆటో డ్రైవర్ల రాష్‌డ్రైవింగ్, పరిమితిని మించి మనుషులను ఎక్కించుకోవడం, వారి ఇష్టానుసారం ఎక్కడపడితే అక్కడ రోడ్లపైనే ఆపేయడం వంటి ఆగడాలను ట్రాఫిక్ పోలీసులు అదుపుచేయలేకపోతున్నారు. చెన్నై మహానగరంలోలాగా మన నెల్లూరులో కూడా ఎక్కువ శాతం ఆటోలు పోలీసోళ్లవే అయినందున ఆటోలోళ్ల దూకుడుని ఎవరూ అదుపు చేయలేకపోతున్నారని అంటున్నారు. జిల్లా ఎస్‌పి గారు పట్టించుకుని ఈ విషయంలో చర్యలు తీసుకుంటే బాగుంటుంది. యువతరం స్పీడుకి కూడా అడ్డూ అదుపు లేకుండాపోతోంది. చాలామంది అసలు లైసెన్స్ లేకుండానే ద్విచక్ర వాహనాలు నడుపుతున్నారు. ట్రాఫిక్ పట్ల అవగాహన కల్పించి ప్రజలను చైతన్యవంతుల్ని చేసే కార్యక్రమాలు చేపడితే బాగుంటుంది. ఎంతమంది అధికారులు మారినా నెల్లూరు ట్రాఫిక్‌ను మాత్రం బాగుచేయలేకపోతున్నారు. ఇప్పుడు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్‌పి, మునిసిపల్ కమిషనర్ అంతా యువకులు, ఉత్సాహవంతులు. ఈ యువ అధికారులన్నా ట్రాఫిక్ సమస్యకి శాశ్వత పరిష్కారం చూపించాలని కోరుతున్నాను.

**సి. హెచ్. రవికుమార్, నెల్లూరు.**

## మొక్కలు నాటి... మహావృక్షాలు పెకలిస్తున్నారు

అదేంటో తెలియదు కాని, మన పాలకులు ఎలాంటి అభివృద్ధి పని చేయాలన్నా ముందుగా మహావృక్షాలకు శాపంగా మారుతుంది. నెల్లూరు, పొదలకూరురోడ్డులో దశాబ్దాలుగా ఉన్న మహావృక్షాలను ఇప్పుడు నిలువునా పెకలిస్తున్నారు. రోడ్డు వెడల్పు పేరుతో వాటిని కూలదోస్తున్నారు. ప్రభుత్వం గ్రీన్ సిటీలంటూ చిన్ని చిన్ని మొక్కలు నాటుతూ ఇలాంటి మహావృక్షాలను పెకలించే పనులు చేయడం సబబు కాదు. రోడ్డు మార్జిన్‌లో ఉన్న మహావృక్షాలను సైతం పెకలించడం బాధాకరం.

**జె. యస్. కృష్ణ, నెల్లూరు.**

• రమేష్‌కుమార్ వర్సెస్ జగన్ ప్రభుత్వం

# ముదురుతున్న వివాదం

➤ వెంటనే ఎలక్షన్‌లు పెట్టమంటున్న అఖిలపక్షాలు

➤ కుదరనే కుదరదంటున్న ప్రభుత్వం



**ఆంధ్రప్రదేశ్ ముఖ్య ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ వర్సెస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మధ్య వివాదం ముదిరి పాకాన పడుతోంది. ఇద్దరిమధ్య మాటల యుద్ధం పతాక స్థాయికి చేరింది.**

ఆంధ్రాలో 2020 ఏప్రిల్ నెలలో జరగవలసిన స్థానిక సంస్థల ఎన్నికలను కరోనా నెపంతో నిమ్మగడ్డ నిరవధికంగా వాయిదా వేయడం, ఆంధ్రా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిమ్మగడ్డపై నేరుగా విమర్శలు చేయడం, ఆయనను తొలగించి మరో అధికారికి పగ్గాలు అప్పజెప్పడం ఆ వెంటనే నిమ్మగడ్డ న్యాయస్థానాన్ని ఆశ్రయించి తిరిగి తన నియామకాన్ని సాధించుకోవడం, ఈ పరిణామాలన్నీ జరుగుతున్న తరుణంలోనే రమేష్‌కుమార్ హైద్రాబాదులోని ఒక స్టార్ హోటల్లో తెలుగుదేశం ఏజెంటుగా భారతీయ జనతాపార్టీలో చేరిన సుజనాచౌదరితో రహస్య భేటీ అవడం, ఆ వీడియోలు సామాజిక మాధ్యమాలలో వైరల్ అయ్యి పెనుదుమారం చెలరేగడం ఇవన్నీ మనకు తెలిసిన సంఘటనలే.

ఇప్పుడు తాజాగా మళ్ళీ వీరి మధ్య వార్ మొదలయ్యింది, స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించడానికి రమేష్‌కుమార్‌ని తమ వద్దకు రావలసిందిగా ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ కబురు పంపించడం, రాజ్యాంగ బాధ్యతలు నిర్వహిస్తున్న నన్ను నీ దగ్గరకు రమ్మంటావా...? ఎంత ధైర్యం అంటూ అందుకు రమేష్‌కుమార్ తీవ్రంగా స్పందించడంతో మరో వివాదానికి తెర లేచింది. తన అనుమతిలేనిదే ముఖ్యమంత్రి కార్యాలయానికి ఏ అధికారి వెళ్ళడానికి లేదని రమేష్‌కుమార్ ఒక హుకుం కూడా జారీ చేశాడు. అవకాశంకోసం కాచుకుని కూర్చున్న బాబు మీడియా ఈ వ్యవహారాన్ని వాడుకుని గోరంతని కొండంత చేసి ప్రచురించాయి.

## అఖిలపక్షాలతో సమావేశం...

ఈ గొడవ ఒకవైపు జరుగుతుండగానే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై తమ అభిప్రాయం వెల్లడించాలంటూ అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి అన్నిపార్టీల నాయకులకి ఆహ్వానం పంపింది నిమ్మగడ్డ నేతృత్వంలోని రాష్ట్ర ఎన్నికల కమిషన్, ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికలు జరిగే పరిస్థితి ఉందా? లేదా?? అన్నది నిర్ణయించాల్సింది రాష్ట్ర ప్రభుత్వ అధికార యంత్రాంగం కాబట్టి మమ్మల్ని సంప్రదించకుండా అఖిలపక్షం పెట్టడం ఏంటి అంటూ బుధవారంనాడు ఉదయం జరిగిన ఆ సమావేశానికి డుమ్మా కొట్టింది.

ఉదయం అఖిలపక్షాలతో ముఖ్య ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ సమావేశం అయిన వెంటనే మీడియా ముందుకు వచ్చిన అంబటి రాంబాబు, అఖిలపక్ష సమావేశంలో అందరిని ఒకేసారి కూర్చోబెట్టి మాట్లాడకుండా ఒక్కొరినే పిలిపించుకుని మాట్లాడారని, ఆలా ఎందుకు చేశారని ప్రశ్నిస్తే కరోనాని కారణంగా చూపారని, మరి ముఖ్య ఎన్నికల అధికారే కరోనాకి భయపడుతుంటే ఈ సమయంలో అసలు ఎన్నికల ప్రస్తావనే తేవడం అసంబద్ధమని ధ్వజమెత్తాడు. నిమ్మగడ్డలోకి చంద్రబాబు పరకాయ ప్రవేశం చేసి మాట్లాడుతున్నాడంటూ ఆరోపించాడు. సందట్లో సడేమియాగా మాటల మంత్రి కొడాలి కూడా ఎన్నికలు ఎప్పుడు జరపాలో మాకు చెప్పడానికి నిమ్మగడ్డ ఎవడని, ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికలు జరిపే ప్రసక్తే లేదని ఖరాకండిగా చెప్పేశాడు.

బుధవారం మధ్యాహ్నం రాష్ట్ర ముఖ్య కార్యదర్శి నీలం సాహ్నీతో కూడా నిమ్మగడ్డ సమావేశమయ్యాడు. నీలంని తన కార్యాలయానికి పిలిపించుకుని స్థానిక సంస్థల ఎన్నికలు జరపడంలో ప్రభుత్వ అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నాడు. ఇప్పట్లో ఎన్నికలు జరపడం అసాధ్యమని చాలా మంది ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, పోలీసు శాఖ సిబ్బంది కరోనా బారినపడి కోలుకుంటున్నారని ఇలాంటి స్థితిలో తగినంత టీమ్‌ని సెటాయించడం కష్టతరమని ఎన్నికలకోసం మరికొంత సమయం తీసుకోవడం ఉత్తమమని ప్రభుత్వం తరపున ఆమె తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పేశారు. ఇప్పుడు ఎన్నికల కమిషన్ అభీష్టం మేరకు త్వరలో ఎన్నికలు జరుగుతాయా..? లేక ప్రభుత్వ నిర్ణయం ప్రకారం మరికొంత కాలం వాయిదాపడతాయా అన్నది వేచి చూడాలి. మొత్తానికి అటు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి మధ్య వివాదం బాగా ముదురుతోంది, రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా జరుగుతున్న ఇలాంటి పరిణామంలో అంతిమ విజయం ఎవరిది కాబోతోందోనని అన్ని రాజకీయ పార్టీలు, రాజకీయ మేధావులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## రామ్ - జగన్ ఆత్మీయ కలయిక



**మాజీముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కుమారుడు, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ తిరుపతి, బాపట్ల పార్లమెంటరీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో అక్టోబర్ 28న కలిశాడు. ఇద్దరిమధ్య ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గూడూరు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల విభాగానికి సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించాలంటూ సంబంధిత వివరాలతో కూడిన లేఖను రామ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి అందించాడు. రామ్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిసింది.**

'ఆపరేషన్ ముస్కాన్' ద్వారా..


# నిరుపేద బాలల జీవితాల్లో కొత్త వెలుగులు

• మరో 406 బాలలకు చేయూత



'ఆపరేషన్ ముస్కాన్' ద్వారా.. నిరుపేద బాలల జీవితాల్లో కొత్త వెలుగులు ప్రసరిస్తున్నాయి. గతంలో కూడా ఈ కార్యక్రమం కింద వందలాదిమంది బాలలను గుర్తించి వారికి విద్యాబుద్ధులు నేర్పి వారి జీవితాలను తీర్చిదిద్దేందుకు జిల్లా అధికారులు ఎంతగానో కృషి చేశారు. తాజాగా జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం చేపట్టి బాలల అభ్యున్నతికి బాసటగా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో ఈనెల 28న 'ఆపరేషన్ ముస్కాన్' కార్యక్రమం చేపట్టడం ఎంతో హర్షణీయం. కరోనా వైరస్ ప్రభావం పదేళ్లలోపు చిన్నారులపై కూడా చూపే అవకాశం ఉంటుందని భావిస్తూ వీధిబాలలను, నిరాశ్రయులైన నిరుపేద బాలలను ఆ వ్యాధి బారినపడకుండా కాపాడేందుకు ప్రభుత్వం సంకల్పించింది. దీంతో జిల్లా పోలీసు అధికారులు, శిశుసంక్షేమ శాఖ అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, కార్మిక శాఖ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని జిల్లావ్యాప్తంగా అనాథలు, నిరాశ్రయులు, నిరాధారణకు గురైన మరో 406 మంది బాలలను గుర్తించారు. వారికి బిస్కెట్లు పండ్లు పంపిణీ చేశారు. కరోనా పరీక్షలు చేయించి వారి ఆరోగ్యానికి అవసరమైన మందులు అందజేశారు. కరోనా వ్యాధి పట్ల వారికి అవగాహన కల్పించారు. జిల్లాలోని అనేకప్రాంతాల్లో రోడ్లపై తిరుగుతున్న బాలలు, హోటళ్ళు రెస్టారెంట్లు, టిఫిన్ దుకాణాలు, దాబాలు తదితర చోట్ల పనిచేస్తున్న ఈ నిరుపేద బాలలను గమనించి తీసుకువచ్చారు. వారిని సంరక్షించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ మాట్లాడుతూ డిజిపి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టి బాలల జీవితాలను సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. చిన్నతనంలోనే అక్షరాలు దిద్దాల్సిన చేతులతో కూలిపనులు చేస్తూ అంధకారంలో ఉన్న చిన్నారులను సంరక్షించి వారికి విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలను కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలతో చర్చిస్తున్నామని చెప్పారు. పిల్లల చదువు గురించి పెద్దలు ఆందోళన చెందకుండా ప్రభుత్వం 'అమ్మ ఒడి'పథకం ద్వారా చేయూత అందిస్తోందని, చదువుకునే పిల్లలకు పుస్తకాలు, యూనిఫాం వగైరాలన్నిటినీ అందజేస్తోందని, పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలను బడులకు పంపి బాగా చదివించి వారి భవితను చక్కదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు జె.శ్రీనివాసులురెడ్డి, పి.మల్లికార్జునరావు, సిఐలు మధుబాబు, వేమారెడ్డి, అన్వర్‌బాషా, నాగేశ్వరమ్మ, సుబ్బారావు, మంగారావు, ట్రాఫిక్ సిఐ రాములు నాయక్, డిసిపిఓ సురేష్, సిడబ్ల్యుసి చైర్‌పర్సన్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

# కరుణిస్తున్న కరోనా!



➤ అయినా అప్రమత్తంగానే ఉండాలి

జిల్లాలో కరోనా కేసులు గత కొద్ది రోజులుగా తగ్గుముఖం పడుతున్నాయి. అంతమాత్రాన ఆ మాయదారి వ్యాధిని నమ్మలేం. ఎప్పుడు విజృంభిస్తుందో చెప్పలేం. కనుక ముందు జాగ్రత్తలు పాటించకుంటే పరిస్థితి మళ్ళీ మొదటికొస్తుంది. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ కరోనా పూర్తిగా సమసిపోయేదాకా ఈ వ్యాధి నివారణకు అవసరమైన అన్ని జాగ్రత్తలు పాటిస్తుండాలని, జిల్లా అధికార యంత్రాంగమంతా పదేపదే చెప్తోంది. నెల్లూరు నగరంలో అనేకమంది మరీ ఎంతో నిర్లక్ష్యంగా ఎక్కడ చూసినా గుంపులుగా ఉంటూ తమకేమీ కాదులే అన్నట్లుగా ఉంటున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం వల్ల ప్రయోజనం ఉండదు. తీరా వ్యాధి అంటుకున్నాక బాధలుపడాల్సిందే!.. కనుక ఇకనైనా ప్రజలంతా కరోనా వ్యాధిని పూర్తిస్థాయిలో నివారించేందుకు సహకరించాలని, ముందు జాగ్రత్తలు పాటిస్తుండాలని అధికారులు కోరుతున్నారు. అందులోనూ వచ్చేది చలికాలం కనుక వ్యాధుల ఉధృతి పెరుగుతుందని, కనుక మరింత జాగ్రత్తగా ఉండాలని గట్టిగా చెప్తున్నారు.

## నాలుగంకెల నుండి రెండంకెలకు చేరిన కేసులు...

గత నెలలో కోవిడ్ కేసులు ప్రతిరోజూ సుమారు వెయ్యి నుంచి 1500 దాకా వచ్చాయి. గత నాలుగు రోజులుగా ఈ కేసుల సంఖ్య వందకు లోపుగానే ఉండడంతో ప్రజలు ఈ మాయదారి కరోనా ఉధృతి తగ్గిందని సంతోషపడుతున్నారు. ఈనెల 28న ఒక్కరోజే 5233 మందికి కరోనా పరీక్షలు నిర్వహిస్తే అందులో 76 మందికి పాజిటివ్ వచ్చింది. గతంతో పోల్చుకుంటే ఈ సంఖ్య స్వల్పంగానే ఉందని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. చికిత్స పొందుతూ కోలుకున్న 159 మంది అదేరోజున డిశ్చార్జి అయ్యారు. తాజాగా వచ్చిన కేసులతో కలిపి చూస్తే జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 60,800 మంది కరోనా వ్యాధికి గురికాగా, ఇందులో 58,749 మంది వైద్యచికిత్సలతో కోలుకున్నారు. కరోనాతో ఆసుపత్రుల్లో చేరినవారు క్రమేణా కోలుకుంటుండడం, క్షేమంగా డిశ్చార్జి అవుతున్న వారి సంఖ్య కూడా ఆశాజనకంగా ఉండడంతో ప్రజలు కొంతమేరకు ఊరట చెందుతున్నారు. నెల్లూరు నగరంలోని పెద్దాసుపత్రిలోను, కోవిడ్‌కేర్ సెంటర్లలోను, హోం ఐసోలేషన్లలోనూ చికిత్సలు పొందుతున్నవారు ఇంకా 1488 మంది దాకా ఉన్నారు. జిల్లాలో ఇప్పటిదాకా ఈ మహమ్మారి వ్యాధికి గురై 563 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇప్పుడు కరోనా తగ్గిపోతోంది కదా అని జాగ్రత్తలు తీసుకోకపోతే మాత్రం ప్రమాదం తప్పదని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# నెల్లూరు కబుర్లు

## 'స్వచ్ఛ నెల్లూరు' లక్ష్యంగా కృషి

**కమిషనర్ దినేష్‌కుమార్**

నెల్లూరు నగరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, అందుకు ప్రజలంతా సహకరించాలని నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ కోరారు. ఈనెల 26న ఆయన నగరంలోని 21వ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డివిజన్‌లో రోడ్ల నిర్మాణానికి మరో 3కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నామన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్తవేయకుండా ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఇక్కడ రోడ్ల నిర్మాణాలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు.

## పెద్దాసుపత్రిలో సాధారణ వైద్యసేవలు

**- వైద్య అధికారులకు జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆదేశం**

కోవిడ్ వైరస్ కారణంగా నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మొన్నటి దాకా కరోనా కేసులను మాత్రమే చూసేవారు. ఈ వైరస్ ప్రభావం తగ్గుతుండడంతో పెద్దాసుపత్రిలో ఈనెల 29 నుంచి నాన్ కోవిడ్ సేవలు కూడా ప్రారంభించాలంటూ జేసీ ప్రభాకర్‌రెడ్డి వైద్యాధి కారులను ఆదేశించారు.

ఈనెల 27న ఆయన నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అందరి సహకారంతో జిల్లాలో కోవిడ్ కేసుల సంఖ్య బాగా తగ్గిపోతుండడం సంతోషకరమన్నారు. అందువల్ల పేదలకు ఇబ్బంది లేకుండా పెద్దాసుపత్రిలో సాధారణ వైద్యసేవలను కూడా ప్రారంభించాలని అధికారులకు సూచించారు. కోవిడ్ వార్డులకు వెళ్ళేందుకు ఆసుపత్రి భవనం ముందువైపు మార్గం నుంచి వెళ్లాలని, నాన్‌కోవిడ్ సేవలకు భవనం వెనుకవైపు ఉన్న మార్గాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. డాక్టర్లను, వైద్య సిబ్బందిని, పారిశుద్ధ్య సిబ్బందిని కోవిడ్, నాన్‌కోవిడ్ సేవలకు ప్రత్యేకంగా విభజించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోవిడ్ నోడల్ అధికారి, డిఆర్‌డిఏ పి.డి నాగలక్ష్మి, పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, ఆర్‌ఎంఓ వి.కళారాణి తదితరులు పాల్గొన్నారు.

### సాయిదర్బార్ అద్దాలమందిరంలో..

## సాయినాధుని 102వ ఆరాధనోత్సవం



నెల్లూరు బాలాజీనగర్ సమీపంలోని పద్మావతినగర్‌లో ఉన్న సాయిదర్బార్ అద్దాల మందిరంలో ఈనెల 26న శ్రీ సాయినాధుని 102వ ఆరాధనోత్సవం జరిగింది. విజయదశమి రోజున సాయినాధుడు సమాధి చెందిన నేపథ్యంలో ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. సాయినాధునికి ప్రత్యేక అభిషేకాలు, షిరిడీ సంప్రదాయ పద్ధతిలో హారతులు ఇచ్చారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల దాకా 'ఓం సాయి శ్రీసాయి జయజయ సాయి' అంటూ సాయినాధుని నామసంకీర్తన నిర్వహించారు. బాబా సమాధిచెందిన సమయమైన మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో 306 జ్యోతులను వెలిగించి సాయినాధుని స్మరించుకున్నారు. మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసూదన సాయి ఆధ్వర్యంలో సత్సంగం నిర్వహించి, సాయినాధునికి నక్షత్ర హారతులిచ్చారు. ఈ ఆరాధనోత్సవాన్ని పురస్కరించుకుని సాయిబాబాకు శోభయమానంగా పుష్పాలంకరణ చేసి విశిష్ట పూజలు చేశారు. మందిరంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, శ్రీ సాయి సచ్చరిత్ర పారాయణం, పల్లకి ఉత్సవం, ఊంజల్‌సే, పవళింపు సేవ నిర్వహించారు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ కార్యక్రమాలు చేపట్టారు.

## ప్రైవేట్ టీచర్లను ఆదుకున్న మంత్రి అనిల్

**వెయ్యిమందికి బియ్యం వితరణ**



నెల్లూరు నగర పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సాయంగా ఈనెల 27వ తేదిన 42వ డివిజన్‌లోని విబియస్ కల్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో బియ్యం బస్తాలను పంపిణీ చేశారు. ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైయస్సార్సీపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు రూప్‌కుమార్‌యాదవ్ చేతుల మీదుగా ఈ సేవా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రూప్‌కుమార్ మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో నెల్లూరు నగరంలోని ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు పడుతున్న కష్టాలను మంత్రి దృష్టికి తీసుకురాగా వెంటనే ఆయన స్పందించి వెయ్యి మంది ఉపాధ్యాయులకు బియ్యం వితరణగా అందించేందుకు ముందుకు వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కర్తం ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు అన్వర్‌బాషా, గౌరవాధ్యక్షుడు చాట్ల నరసింహారావు, పార్టీ నాయకులు కొణిదెల సుధీర్, ఇంతియాజ్, రంగా, సురేష్, శ్రీనివాసులు, దయాకర్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

### కరోనా నేపథ్యంలో..

## ఉద్యోగం కోల్పోయిన కార్మికులకు నిరుద్యోగ భృతి

**- ఇఎస్ఐ బ్రాంచ్ మేనేజర్ వెల్లడి**

కోవిడ్ నేపథ్యంలో ఉద్యోగాలు కోల్పోయిన కార్మికులకు అటల్ భీమిత్ వ్యక్తి కల్యాణ్ యోజన పథకం కింద నిరుద్యోగ భృతి అందజేస్తున్నట్లు ఇఎస్ఐ బ్రాంచ్ మేనేజర్ పివి సుధీర్ పేర్కొన్నారు. నెల్లూరులోని దర్గామిట్టలో ఉన్న ఇఎస్ఐ కార్యాలయంలో ఈనెల 26న 12 మంది లబ్దిదారులకు 1,38,21 రూపాయలను నిరుద్యోగ భృతి కింద వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇఎస్ఐ పరిధిలో ఉండి ఈ ఏడాది మార్చి 24వ తేది తర్వాత కరోనా పరిస్థితుల కారణంగా ఉద్యోగాలు కోల్పోయిన వారికి 3 నెలల కాలానికి వారి జీతంలో 50 శాతం చెల్లించామని, ఉద్యోగం కోల్పోయే నాటికి రెండేళ్ళ సర్వీసు పూర్తిచేసి, తగిన పనిదినాలు కలిగివుండాలని తెలిపారు. ఈ పథకం పట్ల అవగాహన కల్పించేందుకు ఇఎస్ఐ బ్రాంచ్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ కూడా ఏర్పాటు చేశామని, అర్హులైన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భారతీయ మజ్దూర్‌సంఘ్ నాయకుడు మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరులకు ఘన నివాళులు

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నెల్లూరు నవాబుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలీసులు ఈనెల 27న నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి పోలీసు అమరవీరులకు ఘన నివాళులర్పించారు. నవాబుపేట పోలీస్‌స్టేషన్ నుంచి నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వరకు ఈ ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో నవాబుపేట సిఐ వేమారెడ్డి, ఎస్ఐలు రమేష్‌బాబు, శివప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

**గాంధీబొమ్మ సెంటర్‌లో బ్యాండ్ షో :**

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని పోలీసు అమరవీరులకు ఘన నివాళులర్పిస్తూ నెల్లూరులోని పోలీస్‌బ్యాండ్ సిబ్బంది ఈనెల 27న నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో బ్యాండ్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ ఎం.గాంధీ మాట్లాడుతూ పోలీసులు సమాజంలో శాంతిభద్రతలను పరిరక్షణకు అనునిత్యం శ్రమిస్తున్నారన్నారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, మతతత్వం, ఫ్యాక్షనిజం వంటి విచ్ఛిన్నకరశక్తులతో పోరాడే సందర్భాల్లో అనేకమంది పోలీసులు తమ ప్రాణాలను అర్పిస్తున్నారని, వారి త్యాగాలను మరువలేమని, వారి ఆశయసాధనకు కృషిచేయాలని అన్నారు. ఈ సందర్భంగా బ్యాండ్ షో ద్వారా దేశభక్తి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో సంతపేట సిఐ షేక్ అన్వర్‌బాషా, పోలీస్ పిఆర్‌ఓ శ్రీకాంత్, ఆర్ఐ(అడ్మిన్) శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐలు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా సంక్షేమ పథకాలు

**ఉప సభాపతి కోన రఘుపతి**

రాష్ట్రంలో ప్రజలకు ప్రభుత్వం సంక్షేమపథకాలను వేగవంతంగా అందజేసేందుకు అన్నివిధాలైన చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర శాసనసభ ఉప సభాపతి కోన రఘుపతి అన్నారు. ఈనెల 24న ఆయన తిరుపతి నుంచి విజయవాడకు వెళ్తూ మార్గమధ్యంలో నెల్లూరులోని బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కెఎల్ నారాయణరావు నివాసంలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఇక్కడికి వచ్చిన స్పీకర్ దంపతులకు ఆ సమాఖ్య నాయకులు నారాయణరావుతో పాటు గుడ్లదొన వాసుదేవరావు, ఇస్కపల్లి కామేశ్వరప్రసాద్, పూండ్ల గోపాలకృష్ణ తదితరులు సాదరంగా స్వాగతం పలికారు. కరోనా కారణంగా ఉపాధి కోల్పోయిన బ్రాహ్మణులందరికీ ప్రభుత్వం ద్వారా చేయూతనందించాలని ఈ సందర్భంగా వారు ఉప సభాపతికి వినతిపత్రం అందజేశారు.

### సాయి సేవాసదన్ వృద్ధులకు

## 'లయన్స్' అల్పాహారం

నెల్లూరు నగరంలోని కరెంటాఫీస్ సెంటర్‌లో ఉన్న సాయి సేవాసదన్‌లోని వృద్ధులకు నెల్లూరు లయన్స్ క్లబ్ వారు ఈనెల 24న అల్పాహారం అందజేసి వారికి అవసరమైన ప్లేట్లు, గ్లాసులు ఇచ్చారు. లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు రామానుజం, కృష్ణకుమార్, విద్యా కమిటీ ఛైర్మెన్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ సరిహద్దులదాకా

## ప్రత్యేక బస్సులు

తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల దాకా ఈనెల 25 నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నట్లు, నెల్లూరు నుంచి మాచర్ల మీదుగా నాగార్జునసాగర్ వరకు, పిడుగురాళ్ళ మీదుగా పుందూరు వరకు బస్సులు నడుపుతామని ఆర్టీసి ఆర్ఎం శేషయ్య తెలిపారు.

### సైన్స్ టీచర్ల

## సమస్యలు తీర్చండి

**- డిఇఓకు పిఎస్‌టిఎఫ్ నాయకుల వినతి**

జిల్లాలో భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం బోధించే ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని కోరుతూ ఏపి ఫిజకల్ సైన్స్ టీచర్స్ ఫోరం జిల్లా ప్రతినిధులు ఈనెల 26న డిఇఓకి వినతిపత్రం సమర్పించారు. ఫోరం రాష్ట్ర కార్యదర్శి సురేంద్రరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో 50శాతం పోస్టులను ఫిజికల్ సైన్స్ లేక జీవశాస్త్ర ఉపాధ్యాయులకు పోస్టులను సమాన ప్రాతిపదికన కేటాయించాలని, జిఓ నెంబర్ 53 ప్రకారం రేషనలైజేషన్ ప్రక్రియను పూర్తిచేయాలని కోరారు. రేషనలైజేషన్ జాబితాలో ప్రాథమిక పాఠశాలల్లో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయ పోస్టులను జీరోగా చూపారని, దీనిని వెంటనే సరిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. ఫోరం జిల్లా అధ్యక్షుడు రమణమూర్తి, ప్రధాన కార్యదర్శి రాజేష్‌లతో పాటు ప్రతినిధులు ప్రభాకర్, మహేశ్వరరెడ్డి, ఫణికుమార్, రఘుకుమార్, జుల్ఫికర్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

### పింఛనుదారులకీ

## కోవిడ్ పరీక్షలు

జిల్లాలోని పింఛనుదారులకు తప్పనిసరిగా కోవిడ్ పరీక్షలు నిర్వహించాలని జేసీ ప్రభాకర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 24న నెల్లూరు నగరంలోని నుడా కార్యాలయంలో అన్ని మండలాల ఎంపిడిఓలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 3,66,485 మంది పింఛనుదారులున్నారని, వచ్చే నెల 1వ తేది లోపు వారికి కరోనా పరీక్షలు చేయించాలని, 60 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరికీ పరీక్షలు చేయించాలని పేర్కొన్నారు.

### వాత్సల్యకు

## రోటరీక్లబ్ వితరణ

నెల్లూరు రోటరీక్లబ్ వారు ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా ఈనెల 24న నగరంలోని కొండాయపాళెం గేట్ ప్రాంతంలో ఉన్న వాత్సల్య అనాధ శరణాలయంలోని బాలబాలికలకు ఒకరోజు భోజనం సమకూర్చడం కోసం ఆర్థికసాయాన్ని అందజేశారు. వాత్సల్య నిర్వాహకుడు సాంబశివరావుకు ఆ మేరకు చెక్కును అందజేశారు. రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఐ.లక్ష్మీనారాయణ, కొండా శేఖర్‌రెడ్డిలతో పాటు సభ్యులు రాఘవేంద్రశెట్టి, ప్రతాప్‌కుమార్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ సనత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీలో 63శాతం ఉత్తీర్ణత

**- విఎస్‌యు పరీక్షల నియంత్రణాధికారి**

సెప్టెంబర్ 16 నుంచి 23వ తేది వరకు నిర్వహించిన డిగ్రీ ఫైనల్ సెమిస్టర్ పరీక్షలకు మొత్తం విద్యార్థుల 9647 మంది హాజరు కాగా 6170 (63 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారని విఎస్‌యు పరీక్షల నియంత్రణాధికారి డా.సియస్ సాయిప్రసాద్‌రెడ్డి ఈనెల 26న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రీ-వాల్యుయేషన్ కోసం నవంబరు 2వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

### డిగ్రీ ఫలితాల్లో...

# 'కృష్ణచైతన్య' విద్యార్థులు సత్తా చాటారు



విఎస్‌యు ఇటీవల విడుదల చేసిన డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో నెల్లూరులోని కృష్ణచైతన్య కళాశాల విద్యార్థులు తమ సత్తా చాటుకున్నారు. ప్రతిభా పాటవాలతో రాణించి ఉత్తమ మార్కులు సాధించి విజయదుందుభి మోగించారు. అన్ని కోర్సుల్లోనూ, గ్రూపుల్లోను యూనివర్శిటీ స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించి కళాశాల కీర్తిప్రతిష్టలను ఇనుమడింపజేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు డా.ఆర్‌వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు బిఎస్‌సి, బికాం, బిబిఏ, బిసిఏ, ఎంసిఏ డ్యుయల్ డిగ్రీ సెమిస్టర్‌లో యూనివర్శిటీ స్థాయిలో అత్యుత్తమ స్థాయిలో మార్కులు సాధించారని సంతోషం వ్యక్తం చేశారు. బియస్సీలో యూనివర్శిటీలో అత్యధిక మార్కులతో ఎం.లక్ష్మి, ఎస్.శ్రీప్రియ 695 మార్కులు సాధించి 99.5 శాతం మార్కులతో అందరి ప్రశంసలు అందుకుంటున్నారని తెలిపారు. అదేవిధంగా బిబిఏలో కె.విజిత 798 మార్కులు సాధించి 99.8శాతంతో, బిసిఏలో షేక్ షబ్నమ్ 985 మార్కులతో 98.5 శాతంతో, బికాంలో పి.ఇందిర 613 మార్కులు సాధించి 94.5శాతం సాధించారని, ఎంసిఏ డ్యుయల్ డిగ్రీలో ఎం.వి వసంతకుమారి 970మార్కులతో 97శాతం మార్కులు సాధించి యూనివర్శిటీ ఫస్ట్‌గా రాణించడం ఎంతో అభినందనీయమన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థులకు ఉత్తమమైన బోధన, సాంకేతిక అంశాలను అర్థమయ్యేలా వివరిస్తూ, విద్యలో నిరంతర పర్యవేక్షణతో ఇంతటి ఘనవిజయాలను సొంతం చేసుకోగలిగామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లతో పాటు డీన్ బి.సుధారాణి, ప్రిన్సిపాల్స్ ఎన్.కృష్ణకుమార్, ఎస్ నాగయ్య, వైస్ ప్రిన్సిపాల్స్, హెచ్‌డిఓలు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# సబ్సిడీపై ఎరగడ్డలు

### రైతుబజార్లలో కిలో 40 రూపాయలకే

బహిరంగ మార్కెట్లో ఎరగడ్డల ధర భారీగా పెరుగుతుండడంతో వినియోగదారుల సౌకర్యార్థం సబ్సిడీపై రైతుబజార్లలో కేవలం 40 రూపాయలకే ఎరగడ్డలను విక్రయించేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇటీవల నెల్లూరు నగరంలోని ఫతేఖాన్‌పేట రైతుబజార్లో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు సబ్సిడీ ఎరగడ్డల విక్రయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరగడ్డల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం రాయితీపై వాటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. రైతుబజార్లలో 20 టన్నుల ఎరగడ్డలను అందుబాటులో ఉంచామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఎరగడ్డల కొనుగోలుకు వచ్చే ప్రజలు తప్పనిసరిగా తమ ఆధార్‌కార్డు లేదా రేషన్‌కార్డు తీసుకురావాలని, కోవిడ్ నిబంధనలు పాటించాలని తెలిపారు. ఎరగడ్డలను నిల్వచేసుకుని కృత్రిమ కొరతను సృష్టిస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ వ్యాపారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేసీ హరేంద్రప్రసాద్, ఆర్డీఓ హుస్సేన్ సాహెబ్, పౌరసరఫరాల అధికారి బాలకృష్ణ, మార్కెటింగ్ ఏ.డి రమమ్మ, నెల్లూరు తహశీల్దార్ మనోహర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. కాగా, నెల్లూరు నగరంలోని ఫత్తేఖాన్‌పేట, నవాబ్‌పేట తదితర రైతుబజార్లతో పాటు కావలి, గూడూరు ప్రాంతాల్లోని రైతుబజార్లలో సబ్సిడీ ఎరగడ్డలను అందజేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

### 'మనం-మన పరిశుభ్రత' అమలులో...

# డిపిఓ ధనలక్ష్మికి అవార్డు



జిల్లాలో 'మనం-మన పరిశుభ్రత' కార్యక్రమాన్ని విజయవంతంగా అమలుచేస్తున్నందుకు జిల్లా పంచాయతిరాజ్ అధికారి ఎం. ధనలక్ష్మికి రాష్ట్ర ప్రభుత్వం అవార్డునిచ్చింది. పారిశుద్ధ్యం పనుల్లో ప్రజలను భాగస్వాములను చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మనం-మన పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో తొలివిడతలోనే మంచి ఫలితాలు సాధించినందుకు ప్రభుత్వం ఆమెను అభినందిస్తూ ఈ అవార్డుకు ఎంపికచేసింది. రాష్ట్ర పంచాయతిరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖల కమిషనర్ గిరిజాశంకర్ చేతులమీదుగా డిపిఓ ధనలక్ష్మి ఈనెల 27న ఈ అవార్డును అందుకున్నారు. అవార్డుతో పాటు 10వేల రూపాయల నగదు బహుమతిని, ప్రశంసాపత్రాన్ని కూడా ఆమె అందుకున్నారు. ఈ సందర్భంగా డిపిఓ ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఈ ప్రతిష్టాత్మక అవార్డు రావడం తనకెంతో సంతోషం కలిగిస్తోందని, ఇది తన బాధ్యతను మరింతగా గుర్తుచేస్తోందని అన్నారు. తొలివిడత కార్యక్రమం విజయవంతం కావడంతో, రెండవ విడతలో జిల్లాలోని మరో 288 గ్రామపంచాయతీల్లో ఈ కార్యక్రమం అమలు చేస్తున్నామని ఆమె చెప్పారు.

## పరామర్శ...





ఇటీవల మరణించిన తిరుపతి పార్లమెంట్ సభ్యుడు బల్లి దుర్గాప్రసాదరావు కుటుంబసభ్యులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు, వైయస్సార్ పార్టీ నెల్లూరుజిల్లా సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి మంగళవారం నాడు పరామర్శించాడు. అక్టోబర్ 27వ తేదీ వెంకటగిరిలోని బల్లి నివాసానికి వెళ్లిన ఆయన దుర్గాప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పించాడు.

# అల్లుడు పుట్టినరోజున అత్తమామల 'వాత్సల్యం'





అక్టోబర్ 27వ తేదీన తమ అల్లుడు నేదురుమల్లి గౌతం పుట్టినరోజు సందర్భంగా శాంత బయోటెక్నిక్స్ వ్యవస్థాపక ఛైర్మెన్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి, వారి సతీమణి వసంత నెల్లూరులోని జనహిత వాత్సల్యలోని చిన్నారులకు, వృద్ధులకు ప్రత్యేక భోజన వసతితో పాటు అక్కడ పనిచేసే సిబ్బందితో సహా అందరికీ నూతన వస్త్రాలను అందింపజేశారు.

గౌతం పుట్టినరోజును పురస్కరించుకుని వాత్సల్యలో జరిగిన కార్యక్రమంలో గణపతి, హనుమంతుడు, లలితాంబికా, శ్రీ వేంకటేశ్వరస్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం వాత్సల్య చిన్నారుల చేత మంత్రపుష్పం చదివించి, నరసింహకొండలోని మహేశ్వరానంద ఆశ్రమానికి చెందిన మాతాజీ బుజ్జమ్మ గారి చేతులమీదుగా 120 మందికి నూతన వస్త్రాలను బహుకరింపజేశారు.

ఈ కార్యక్రమం కోసం వరప్రసాద్‌రెడ్డి – వసంత దంపతులు 80వేల రూపాయలను ఈ ఆశ్రమానికి అందించారని జనహిత – వాత్సల్య ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివరావు తెలిపాడు. ఈ సందర్భంగా వరప్రసాద్‌రెడ్డి గారి కుటుంబసభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపాడు.

### సోమశిలలో

# పుష్కలంగా నీళ్ళు

సోమశిల జలాశయంలో పుష్కలంగా నీళ్ళున్నాయి. ఈనెల 27వ తేది నాటికి 74.985 టిఎంసిల నీరు నిల్వ ఉందని. వర్షాల ప్రభావంతో పైతట్టు ప్రాంతాల నుంచి మంగళవారం నాటికి 11,756 క్యూసెక్కుల వంతున వరదనీరు సోమశిల రిజర్వాయర్‌కు చేరుకుంటున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

# 'వెన్నెల గొడుగు' నవలకు పురస్కారం

ప్రముఖ నవలా రచయిత్రి, నెల్లూరుకు చెందిన డాక్టర్ పెళ్ళకూరు జయప్రద ఆధ్వర్యంలో నిర్వహించిన నవలా పురస్కారానికి హైదరాబాద్‌కు చెందిన రచయిత సింహప్రసాద్ రచించిన 'వెన్నెల గొడుగు' నవల ఎంపికైనట్లు డాక్టర్ పెళ్ళకూరు జయప్రద ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ పెళ్ళకూరు జయప్రద, విశాలాక్షి సాహితీ మాసపత్రిక సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో విజేతకు డిసెంబర్‌లో జరిగే కార్యక్రమంలో పాతికవేల రూపాయల నగదు బహుమతిని అందజేస్తామన్నారు. వి.చెన్నయ్య రచించిన 'పెళ్ళి ఎంత కఠినం', పెబ్బిలి హైమవతి రచించిన 'మాతృదేవోభవ', కనుపూరు శ్రీనివాసులు రెడ్డి 'సంధ్యా సమయంలో', సుజనాదేవి రచించిన 'ఐ లవ్ ఇండియా' నవలలు ఉత్తమ పురస్కారాలకు ఎంపికయ్యాయని పేర్కొన్నారు.

### వ్యాపార సంస్కరణల అమలులో...

# ఆంధ్రప్రదేశ్‌దే అగ్రస్థానం

**- డిజిటల్ సమావేశంలో పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి**



వ్యాపార సంస్కరణల కార్యాచరణ ప్రణాళికను అమలుచేయడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని, వ్యాపార పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన రాష్ట్రంగా వరుసగా మూడవ సంవత్సరం కూడా ఎంపికైందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఐటి శాఖల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి చెప్పారు. ఈనెల 27న 'పెట్టుబడులకు గమ్యంగా ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై వైజాగ్ ఇండస్ట్రియల్ స్కాన్ (విస్కాన్) నిర్వహించిన డిజిటల్ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించేందుకు అధికారుల దృక్పథంలో మార్పుతో పాటు, ఈ అగ్రస్థానాన్ని నిలుపుకునేలా ముఖ్యమంత్రి దృష్టి సారించారని, పెట్టుబడుల గమ్యస్థానంగా రాష్ట్రాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళుతోందని అన్నారు. శ్రీసిటీ ప్రామాణికంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పారిశ్రామిక పార్కులను కొత్తగా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని, అలాంటి ప్రపంచస్థాయి పారిశ్రామిక పార్కును అభివృద్ధి చేసేందుకు శ్రీసిటీ ఎం.డి రవీంద్రసన్నారెడ్డి అభినందనీయుడన్నారు.

### పెట్టుబడుల గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ - శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి

మౌలిక సదుపాయాల వృద్ధిపై దృష్టి సారించి పారిశ్రామికంగా సుస్థిరమైన అభివృద్ధికి కొత్తప్రయాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించడమేకాక, రాష్ట్రం పెట్టుబడుల గమ్యస్థానంగా కొనసాగుతుండడం ఎంతో సంతోషదాయకమని ఈ సమావేశంలో పాల్గొన్న శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి అన్నారు. పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాల్సి ఉందని సూచించారు. 27 దేశాల నుంచి 187 పారిశ్రామిక యూనిట్లకు శ్రీసిటీ నిలయంగా ఉందని పేర్కొన్నారు.



నెల్లూరుజిల్లా పర్యటనలో భాగంగా అక్టోబర్ 27వ తేదీ వెంకటగిరిలో తిరుపతి ఎంపి దివంగత బల్లి దుర్గాప్రసాద్ కుటుంబసభ్యులను పరామర్శించిన అనంతరం నెల్లూరులో జరిగే రివ్యూ మీటింగ్‌కు వెళ్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి మార్గ మధ్యంలో గోగినేనిపురం వద్ద స్వాగతం పలుకుతున్న వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి.

# దివ్యాంగునికి వీల్‌ఛైర్



ఇటీవల జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పెదపరియ గ్రామానికి చెందిన దివ్యాంగుడు ఈశ్వరయ్యకు వీల్‌ఛైర్, వృద్ధుల ఆశ్రమానికి గోడగడియారాలు, బిస్కెట్ ప్యాకెట్‌లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న కుడుముల వెంకటనారాయణ, శ్యాం చేతుల మీదుగ ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జె.వి.వి అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సంక్రాంతికి ఈ ఆశ్రమంలో ఉన్న వృద్ధులందరికీ నూతన దుస్తులు తీసిస్తామని, వారిని అన్నివిధాలా ఆదుకుంటామని, మీ అందరికీ జె.వి.వి అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్ర మంలో మనోహర్‌గౌడ్, గోపి, అశోక్, చిన్నయ్య, శంకర్, శ్రీను, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అక్టోబర్ 25, విజయదశమి సందర్భంగా కనుపూరు శ్రీ ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న గూడూరు సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ, పక్కన ఆలయ ఇ.ఓ జనార్ధన్‌రెడ్డి, ఛైర్మెన్ మురళీమోహన్‌రెడ్డి

## గూడూరు డివిజన్ వార్తలు

# నిరుపేదలకు 'ప్రగతి' సంస్థ పలసరుకులు



గూడూరులోని ప్రగతి సేవా సంస్థ జాయింట్ సెక్రటరీ యమహా సుబ్రహ్మణ్యం పెళ్లిరోజును పురస్కరించుకుని, విజయ దశమి పర్వదినం సందర్భంగా ఆయన సహాయసహకారాలతో అక్టోబర్ 25న 10మంది నిరుపేద కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి 10 కేజీల బియ్యం, 8 రకాల పలసరుకులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ చేతుల మీదుగా ఈ సేవా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


# జనసేన నాయకుడికి సన్మానం



కరోనా కష్టకాలంలో నిర్విరామ సేవలందించిన జనసేన నాయకుడు నయీమ్‌ను అక్టోబర్ 25వ తేదీ ప్రెస్ క్లబ్‌లో ఆ పార్టీ నాయకులు సందీప్, పవన్, చాన్‌బాషా సన్మానించారు. అలాగే వరల్డ్ హ్యూమన్‌రైట్స్ ఆర్టీఐ సెల్ సౌత్‌జోన్ ప్రొటెక్టర్‌గా ఎంపికైన మగ్దూమ్‌ను దర్గా అభివృద్ధి కమిటీ, ఏపిఎండబ్ల్యూ, ఇన్సాఫ్, దర్గా యూత్ ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు.



పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ఈ నెల 27వ తేదీ క్రీడాకారులతో కలిసి ఐక్యతా పరుగులో పాల్గొన్న గూడూరు సి.ఐ. దశరధరామారావు

### ఇచ్చిన హామీలకన్నా మిన్నగా...

# ప్రజలకు సంక్షేమ పథకాలు

**ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి**



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సారధ్యంలో రాష్ట్రప్రజలకు గతంలో ఎప్పుడూ కనీవినీ ఎరుగని విధంగా ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీల కన్నా మిన్నగా వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలను అమలుచేస్తుండడంతో ప్రజలు ఎంతో సంతోషిస్తున్నారని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. వెంకటాచలం మండలంలోని కాకుటూరులో ఉన్న గ్రామ సచివాలయాన్ని ఆయన ఈనెల 26న సందర్శించి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి-ప్రజల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి జగన్ ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారని, గ్రామాల్లో పరిపాలనా వ్యవస్థను పటిష్టం చేసి అర్హులైన ప్రతిఒక్కరికి సచివాలయ వ్యవస్థ ద్వారా అభివృద్ధి సంక్షేమ పథకాలను అందజేస్తుండడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజాసంక్షేమ కార్యక్రమాలను సమర్ధవంతంగా అమలుచేసేందుకు గ్రామ సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు చిత్తశుద్ధితో కృషి చేయాలని చెప్పారు. సర్వేపల్లి నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ఇక్కడి ప్రజల రుణం తీర్చుకుంటానని కాకాణి ఈ సందర్భంగా చెప్పారు. అనంతరం నాడు-నేడు పనులను సమీక్షించారు. పలువురు లబ్దిదారులకు పింఛన్లు, రేషన్‌కార్డులు, విద్యార్థులకు విద్యా కానుక కిట్లు, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఎంపిడిఓ సరళ, వైయస్సార్సీపి జిల్లా కార్యదర్శి కనుపూరు కోదండరామిరెడ్డి, నాయకులు వెంకటశేషయ్య, వల్లూరు రమణయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఎనర్జీ అసిస్టెంట్లు బాధ్యతాయుతంగా పనిచేయాలి

**విద్యుత్‌శాఖ ఎస్ఇ విజయకుమార్‌రెడ్డి**

జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఎనర్జీ అసిసెంట్లు వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విధులు నిర్వహించాలని ఎపిఎస్పీ డిసిఎల్ జిల్లా సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ విజయకుమార్‌రెడ్డి ఆదేశించారు. ఈనెల 26న ఆయన నెల్లూరులోని సంజయ్‌గాంధీ నగర్, వెంగళరావునగర్‌లలోని సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు చేశారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు 56 రకాల విద్యుత్‌సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని, ఇందులో భాగంగా గృహ, వాణిజ్య విద్యుత్ వినయోగదారులకు అవసరమైన అన్ని రకాల సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కొత్త సర్వీసులు, ఫేజ్ మార్పు, కేటగిరి, పేరు మార్పు తదితర 56 రకాల సేవలను వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడిఇ అల్తాఫ్, ఏఇ అశోక్‌తో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### తోపుగుంటలో

# సజ్జ కొనుగోలు కేంద్రం

సజ్జల పంట విస్తారంగా పండే కలువాయి మండలంలోని తోపుగుంట, తెలుగురాయపురం గ్రామాల రైతులకు అందుబాటులో ఉండేవిధంగా ఈనెల 26న తోపుగుంటలో మార్క్‌ఫెడ్ ద్వారా సజ్జ కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేశారు. ఈ కేంద్రంలో రైతుల నుంచి నేరుగా సజ్జలను కొనుగోలు చేస్తారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు కలువాయి వ్యవసాయ సలహాకమిటీ అధ్యక్షుడు చల్లా రఘురామిరెడ్డి, పిఏసిఎఫ్ అధ్యక్షుడు సుబ్బరామిరెడ్డి, రాపూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌ప్రెసిడెంట్ చాంద్‌బాషా, వైఎస్సార్సీపి నాయకుడు చల్లా శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వేణుగోపాలస్వామికి

# వేడుకగా గరుడసేవ

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పంచేడు గ్రామంలో ఉన్న రుక్మిణి సమేత శ్రీ వేణుగోపాలస్వామికి ఈనెల 26న ఎంతో వైభవంగా గరుడసేవ నిర్వహించారు. స్వామివారిని గజమాలతో, వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామప్రజలు, భక్తులు గరుడవాహనంలో ఉన్న శ్రీస్వామివారిని దర్శించుకుని తరించారు.

# అన్నదానం

మనుబోలులోని కెఆర్‌పురం దేవాంగుల కాలనీలో ఉన్న పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో ఈనెల 26న విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశిష్టపూజలు నిర్వహించారు. అనంతరం ఉభయకర్తల సౌజన్యంతో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# భక్తిశ్రద్ధలతో ఏఎస్‌పేట గంధ మహోత్సవం



ఎంతో పవిత్రమైన ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజా నాయబ్ రసూల్ దర్గాలో ఈనెల 26వతేది అర్ధరాత్రి దొరసానమ్మ గంధోత్సవం కన్నులపండువగా జరిగింది. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. రకరకాల సుగంధ పరిమళభరిత ద్రవ్యాలతో గంధం తయారుచేశారు. ఖురాన్ పఠనం, దివిటీల వెలుగులు, బాణసంచా వేడుకలతో గంధం ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. హజరత్ ఖాజా నాయబ్ రసూల్, దొరసానమ్మ సమాధులకు గంధలేపనం చేశారు. పీఠాధిపతి హాఫీజ్‌పాష గలేఫ్ ఆధ్వర్యంలో సమాధులపై వస్త్రాలను, పూలచద్దర్‌లను పరిచారు. కోవిడ్ నిబంధనలను పాటిస్తూ ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఆత్మకూరు సిఐ సోమయ్య ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

# నిరాడంబరంగా వేనాడు దర్గా గంధోత్సవం

తడ మండలంలోని వేనాడు గ్రామంలో ఉన్న పవిత్రమైన హజరత్ షేక్ దావూద్ షావలి అల్లా దర్గా గంధోత్సవం ఈనెల 24న జరిగింది. కోవిడ్ నిబంధనలతో ఏకాంతంగా ఈ వేడుక నిర్వహించారు. దర్గాలో గంధం కలిపి అల్లా సమాధి చుట్టూ గంధలేపనం చేసి ఉత్సవం నిర్వహించారు. కరోనా నేపథ్యంలో ఈ కార్యక్రమం ఎలాంటి ఆర్భాటం లేకుండా నిరాడంబరంగా జరిగింది.

# నష్టపోయిన రైతులకు త్వరలోనే పరిహారం

జిల్లాలో గతంలో కురిసిన వర్షాలకు 5076 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని, నష్టపోయిన రైతులకు వారం రోజుల్లోనే పరిహారంగా సుమారు 5.5 కోట్ల రూపాయలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు చెప్పారు. ఈనెల 26న ఆయన సంగం సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతుల సౌలభ్యం కోసం 270 గోదాముల నిర్మాణాలకు స్థలాల ఎంపికను పూర్తిచేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తహశీల్దార్ నిర్మలానందబాబ తదితరులున్నారు.

# దోమలను అరికట్టండి - హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ

నెల్లూరు నగరంలో దోమలు నివారించేందుకు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఈనెల 27న ఆయన నగరంలోని వెంకటేశ్వరపురం మునిసిపల్ పాఠశాలలో సచివాలయ హెల్త్ కార్యదర్శులు, వాలంటీర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ నగరంలోని సైడుకాలువల్లో మురుగును తొలగించాలని, నగరంలో వీధులు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అన్నారు. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి విషజ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఈ వ్యాధుల పట్ల సిబ్బంది ప్రజలకు తగు అవగాహన కల్పించాలని సూచించారు.

# ప్రకృతి ఒడిలో పరవశించే పుణ్యక్షేత్రం.. సిద్ధలయ్య కోన

***సముద్రమట్టానికి సుమారు 150 అడుగుల ఎత్తులో ఉన్న కొండకోనల్లో సహజసిద్ధమైన కొండరాళ్లు, ఎప్పుడూ ఇంకిపోని మంచినీటి కొలనులతో అటు భక్తులను ఇటు పర్యాటకులను బాగా ఆకట్టుకుంటూ ఎంతో రమణీయంగా ఉంటుంది పరమపవిత్రమైన సిద్ధలయ్య కోన క్షేత్రం.***







***శోభాయమానమైన ప్రకృతి రమణీయ సోయగాల మధ్య భక్తుల కొంగుబంగారంగా, కోరిన కోరికలు తీర్చే మహిమాన్వితమైన క్షేత్రంగా వెలసిన శ్రీ సిద్ధేశ్వర కోన (సిద్ధలయ్య కోన) నెల్లూరుజిల్లాలోని ప్రాచీన పుణ్యక్షేత్రాల్లో ఒకటి. మండల కేంద్రమైన సైదాపురానికి మూడు కిలోమీటర్ల దూరంలో అటవీప్రాంతంలో ఉన్న ఈ కోనలో స్వయంభువుగా వెలసిన శ్రీ నవకోటి సిద్ధేశ్వరస్వామి వారి సన్నిధి, శ్రీ నవనాథ సిద్ధేశ్వరస్వామితో పాటు, వారి శిష్యులైన సారగంధరస్వాముల వారి దేవస్థానం ఎంతో ప్రసిద్ధమైనవి.***

**ఆలయ చరిత్ర :**

సిద్ధలయ్య కోనలో స్వయంభువుగా వెలసిన శ్రీ నవకోటి సిద్ధేశ్వరస్వామి వారి సన్నిధి, శ్రీ నవనాథ సిద్ధేశ్వరస్వామితో పాటు, వారి శిష్యులైన సారగంధరస్వాముల వారి దేవస్థానం పురాతన కాలం నుంచి ఎంతో ప్రసిద్ధమైనవి. ఎంతో మహిమాన్వితమైన ఈ ఆలయ చరిత్రను పరిశీలిస్తే దాదాపు రెండు వేల సంవత్సరాల క్రితమే ఈ క్షేత్రం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్షేత్రం ఆవిర్భావం గురించి ఎంతోకాలంగా రకరకాల కథనాలున్నాయి. ప్రాచీనకాలంలో వేట కోసం ఈ అటవీ ప్రాంతానికి వచ్చిన సారంగధరుడనే ఒక గిరిజనుడు దారితప్పి మూడురోజుల పాటు అడవిలో తిరుగుతూ.. ఈ ప్రాంతంలో ఇద్దరు మునీశ్వరులు తపస్సులో ఉండడం గమనిస్తాడు. వారు కళ్ళు తెరచి తమ ఉనికిని ఎవరికీ చెప్పవద్దని, అలా చెప్తే నీ శిరస్సు ముక్కలవుతుందని హెచ్చరించినా, తమ ప్రాంత ప్రజల ఒత్తిడిపై ఆ విషయాన్ని బహిరంగపరచడంతో ఆ గిరిజనుడు మునుల శాపానికి గురై చనిపోతాడు. ఆ తర్వాత ఆ మునులు ఆయన్ను తమ ప్రియశిష్యునిగా భావించి సారంగధరుని విగ్రహాన్ని కూడా తమ సమీపంలోనే ప్రతిష్ఠించమని భక్తులకు చెప్పి వారు శిలలుగా మారినట్లు పలురకాల కథనాలు ప్రచారంలో ఉన్నాయి. ఈ మునీశ్వరులు శైవులని కొందరు, జైనమతస్తులని కొందరు చెప్తున్నారు. ఏదేమైనా భక్తులు కోరిన కోర్కెలు తీర్చే దైవాలుగా వారు నేటికీ అందరి పూజలందుకుంటూనే ఉన్నారు.

**విశిష్టమైన మంచినీటి దోనెలు :**

ఎక్కడా లేనివిధంగా ఉన్న సిద్ధలయ్య కోన సమీపంలోని దోనెలు ఎంతో అరుదైనవి.. విశిష్టమైనవి కూడా. ఈ కోనల్లో మంచినీటి దోనె, పసుపునీరు, చెక్కపొడి, శీకాయ, కుంకుమ, గంధం, విభూది, సంతానం దోనె అనే పేర్లతో పలురకాలైన దోనెలు (కొలనులు) భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంటాయి. ఈ పవిత్రమైన దోనెల్లో స్నానమాచరిస్తే సకల రోగాలు సమసి పోతాయని, సంతానం లేనివారు ఈ దోనెల్లో స్నానమాచరించి స్వామివార్లకు మొక్కుకుంటే సంతానప్రాప్తి కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అలా సంతానం పొందినవారు తమ బిడ్డలకు సిద్ధలయ్య, సిద్ధయ్య, సిద్ధమ్మ, సిద్ధేశ్వరుడు, సారంగయ్య అనే పేర్లు పెట్టుకుని తమ మొక్కుబడులు తీర్చుకుంటూ ఉంటారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పేర్లు అందరికీ చాలా సుపరిచితమే. సిద్ధలయ్య కోనలో ఒక్కొక్క గ్రహానికి ఒక్కో గుడి నిర్మించి ఉండడం, ప్రతి శనివారం రోజున జిల్లా నలుమూలల నుంచి భక్తులు వచ్చి ఇక్కడి నవగ్రహాలకు పూజలు నిర్వహిస్తుండడం మరో విశేషం. ఎందరో దాతలు, భక్తుల సహకారంతో సిద్ధలయ్య కోన ఇటీవలికాలంలో బాగా అభివృద్ధి చెందుతూ ఉంది కూడా.

**మంత్రపుష్పాల మహిమలు :**

సంతానం లేనివారు, రకరకాల జబ్బులతో బాధపడేవారు, సమస్యలతో కొట్టుమిట్టాడేవారు ఇక్కడున్న సిద్ధేశ్వర, నవనాథ సిద్ధేశ్వరస్వాముల వారి శిరసుపై పుష్పాలను ఉంచి ప్రార్థిస్తే ఆ పుష్పాలు కుడివైపున కిందపడితే త్వరలోనే వారి కోర్కెలు సిద్ధిస్తాయని, వెనుకభాగంలో కానీ ఎడమవైపు కానీ పడితే వారి సమస్యలు తీరవని భక్తులు విశ్వసిస్తుంటారు. ఆ పుష్పాలను మంత్రపుష్పాలుగా భక్తులు వ్యవహరిస్తుంటారు. ప్రతి ఏటా కార్తీక మాసంలో స్వామివార్లకు ప్రత్యేకపూజలు చేసి అత్యంత వైభవంగా నిర్వహించే సిద్ధలయ్య కోన తిరునాళ్లకు రాష్ట్రవ్యాప్తంగానే కాక తమిళనాడు, కర్నాటక తదితర రాష్ట్రాల నుంచి కూడా భక్తజనం వేలాదిగా ఈ పుణ్యక్షేత్రానికి తరలివస్తుండడం ఎంతైనా విశేషం!...

# మాగుంట సారధ్యంలో భారీ వ్యాపార సముదాయం..!




- 50 వేల చదరపు అడుగుల నిర్మాణంతో ఒకటిన్నర ఎకరాలలో “9th Street” నిర్మాణానికి శ్రీకారం
- స్థానిక వ్యాపారవేత్తల సౌలభ్యమే లక్ష్యంగా రంగమహల్(అర్చన), శేషమహల్ ప్రాంగణంలో రూపకల్పన
- 2022 సంక్రాంతికి ప్రారంభించే దిశగా అడుగులు

**కృష్ణ, కావేరి, కల్యాణి పేరుతో రాఘువ సినీ కాంప్లెక్స్ కట్టినప్పుడు మూడుహాళ్లో ళ్లుగా ఆ కుటుంబం నెల్లూరీయులకు పరిచయం అయ్యింది. ఆ తరువాత యన్‌టి రామారావు వీరాభిమాని తాళ్ళపాక రమేష్ రెడ్డి చొరవతో నెల్లూరోళ్ల దాహార్తిని తీర్చ డానికి నగరంలో అనేక చోట్ల సింటెక్స్ వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేసి, ట్యాంకర్ల ద్వారా వాటిలో నీటిని నింపినప్పుడు వాళ్ళు మాగుంటోళ్ళుగా తెలిసింది. *1991*లో ఆ కుటుంబం రాజకీయ ఆరంగేట్రం చేసినప్పుడు అది మాగుంట సుబ్బ రామిరెడ్డి కుటుంబం అని సమాజానికి అర్ధమయ్యింది.**

“మాగుంట”.. ఆ పేరంటేనే ఒక సంచలనం. వాళ్లు ఏ పని చేసినా ఒక ప్రత్యేకత కనిపిస్తుంది. అలాంటి మరో సంచలనమే ఇప్పుడు ఆ కుటుంబం ఆవిష్క రించబోతోంది. గతంలో రంగమహల్, శేషమహల్‌గా ప్రసిద్ధిచెంది, మాగుంట వాళ్ళ హస్తగతం అయిన తరువాత రంగ మహల్ మాత్రం ‘అర్చన’గా మొట్టమొదటి 70యంయం ధియేటర్‌గా అవతరించిన విషయం చాలామంది పాతతరం నెల్లూరీయులకు తెలిసిందే. అప్పట్లో అర్చన 70 యంయం అంటే అతి పెద్ద సంచలనం. శేషమహల్ మాత్రం అలాగే మిగిలిపోయింది. ఇప్పుడు ఆ మొత్తం ప్రాంగణాన్ని కలిపి అద్భుతమైన వ్యాపార సముదాయాన్ని నిర్మించబోతోంది ఆ కుటుంబం.

ఈ మొత్తం ప్రాంగణం 935 అంకణాలు. ఒకటిన్నర ఎకరం కంటే ఎక్కువ. ఇప్పుడు ఆ ప్రాంగణంలో “నైన్త్ స్ట్రీట్” (9th Street) అనే పేరుతో భారీ వ్యాపార సముదాయాన్ని నిర్మించడానికి సన్నాహాలు ప్రారంభించింది మాగుంట కుటుంబం. తొలుతగా 50వేల చదరపు అడుగులతో కేవలం జి+1 అంటే రెండు అంతస్తులకే ఈ నిర్మాణాన్ని పరిమితం చేస్తూ భవిష్యత్తులో 4అంతస్తులకు పెంచేలా ప్రణాళికలను తయారుచేసుకుని నిర్మాణం చేపట్టబోతున్నారు.


### స్థానిక వ్యాపారస్తులకు సౌకర్యంగా

ఆధునిక వసతులతో అంతర్జాతీయ



గ్రౌండ్ ఫ్లోర్ నమూనా

ప్రమాణాలతో నిర్మిస్తున్న ఈ “9th Street”ను జాతీయ అంతర్జాతీయ బ్రాండ్లకు పరిమితం చేయకుండా ఎక్కువగా స్థానిక వ్యాపారస్తులను ప్రోత్సహించే విధంగా రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. తొలి దశలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో 42, మొదటి అంతస్తులో 43తో మొత్తంగా 85 షాపులను అందుబాటులోకి తేబోతున్నట్లు సమాచారం. ఇవి కాకుండా రెండు అంతస్తు



ఫస్ట్ ఫ్లోర్ నమూనా

లలోనూ కారిడార్లలో చిన్న చిన్న దుకాణాలను ఏర్పాటు చేసుకునే విధంగా డిజైన్ చేశారు. మొత్తం మీద ధనిక వర్గాలకోసం కాకుండా సామాన్యులకు ఆధునిక వసతులు కలిగిన షాపింగ్ మాల్ అందించాలన్నది వీరి లక్ష్యంగా అర్ధమవుతోంది.

### జూనియర్ సుబ్బరామిరెడ్డి పర్యవేక్షణలో

ఈ నిర్మాణానికి సంబంధించి పూర్తి వ్యవహారాలు దివంగత మాగుంట సుబ్బ రామన్న మనుమడు జూనియర్ మాగుంట సుబ్బరామిరెడ్డి పర్యవేక్షిస్తున్నట్లు తెలిసింది. 2022 సంక్రాంతికి ఈ సముదాయాన్ని పూర్తిచేసి అందించాలన్నది వీరి లక్ష్యం. మొత్తానికి నెల్లూరులో మరో అద్భుత వ్యాపారసౌధం రావడం, అదీ మాగుంట కుటుంబం నుండి... ఈ తరం కుర్రోడి ఆధునిక ఆలోచనలనుండి రూపొందించ బడడం సంతోషదాయకం. సుబ్బరామ్‌కి ఆయన టీంకి... ఆల్‌ది బెస్ట్.

# ఆశల పల్లకిలో కమల దళం

(మొదటి పేజీ తరువాయి)

పత్రికలలో ప్రకటించుకుని సంబరాలతో ప్రచారం చేసుకున్నట్లు కూడా చేసుకుని అభివృద్ధిని తమ ఖాతాలో వేసుకోవచ్చు, కావాల్సినంత పబ్లిసిటీ ఇచ్చుకోవచ్చు.

ఇప్పుడు ఆంధ్రా ప్రజలకి కావలసింది అభివృద్ధి. రాజధానులు మార్చడం, హైకోర్టులు తరలించడం, వేల కోట్ల రూపాయల డబ్బులు ప్రజల అకౌంట్లలో వెయ్యడం కాదు. భారతీయ జనతా పార్టీకి చేతనైతే అభివృద్ధిపై దృష్టి పెట్టాలి. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వాలి. పోలవరంతో పాటు భారీ నీటి పారుదల ప్రాజెక్టులతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చెయ్యాలి. వందల కిలోమీటర్లు విస్తరించివున్న తీర ప్రాంతాన్ని సద్వినియోగం చేసుకుని పారిశ్రామిక ప్రగతికి గేట్లు తెరవాలి. అధ్వాన్నంగా వున్న కొన్ని వేల కిలోమీటర్ల రోడ్లను అభివృద్ధి చెయ్యాలి, అన్నదాతలకు అగ్రతాంబూలం ఇచ్చి దేశానికి పట్టుకొమ్మలుగా చెప్పబడుతున్న పల్లెలను ప్రగతి బాటలో నడిపించాలి, అంతే కానీ కాపులను చేరదీస్తాం, రెడ్లను లాక్కుంటాం, తీర్మానాలను అడ్డుకుంటాం, పార్టీ కార్యాలయాలు కడతాం అంటే, ఇప్పుడు కాదు కదా కమలదళం అధికార పగ్గాలు చేపట్టడం ఎప్పటికీ కలగానే మిగిలిపోవడం తథ్యం.

ఆంధ్రప్రదేశ్‌కి అవసరమైన ‘ప్రత్యేక హోదా’గాని, అత్యవసరమైన పోలవరం ప్రాజెక్టు సత్వర నిర్మాణానికి కావాల్సిన నిధులను సమకూర్చడం కాని, లేదా ఇతరత్రా అభివృద్ధి పనులకు ప్రోత్సాహం కాని ఇవ్వకుండా రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చేస్తామంటూ కమలనాథులు చెప్పుకోవడం విడ్డూరంగా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఆంధ్ర రాష్ట్రాన్ని గతంలో అడ్డగోలుగా ముక్కలు చెక్కలు చేసిన జాతీయ పార్టీ కాంగ్రెస్‌ని ఆంధ్రప్రదేశ్ ప్రజలు అసలు నమ్మే పరిస్థితిలో లేరన్నది విశ్లేషకుల అంచనా. అదే విధంగా, తాము అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరగనిచ్చేది లేదని వాగ్దానం చేసి... 2014 ఎన్నికలలో బూటకపు బాబుతో చేతులు కలిపి బాబుకి అధికారం కట్టబెట్టడానికి కారణభూతులై, ఆ తరువాత.. ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నిలబెట్టుకోక అరకొర నిధులతో సరిపెట్టేస్తున్న బీజేపీని ఇప్పుడున్న పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలు ఎంతవరకు ఆదరిస్తారన్నది ప్రశ్నార్ధకంగా మారింది! ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీకి నాయకత్వ లోపం ఒక పెద్ద శాపంగా ఉందని అందరికీ తెలిసిందే! మరోవైపు ఇక్కడ ప్రాంతీయపార్టీల వైపే గత కొద్దికాలంగా ప్రజలు మొగ్గుచూపుతున్నారన్నది జగద్విదితం. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో జాతీయ పార్టీ అయిన బీజేపీ ఎలా నెగ్గుకొస్తుందన్నది సర్వత్రా చర్చనీయాంశంగా ఉంది. బీజేపీ ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి రావడానికి రాజకీయంగా పావులు కదుపుతున్నప్పటికీ, ఆచరణలో ఆ పార్టీ ప్రయత్నాలు భవిష్యత్తులో ఎంతవరకు సఫలీకృతమవుతాయో వేచిచూడాలి మరి!?

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు








## స్నేహబంధం...

మంగళవారం నాడు నెల్లూరుకు వచ్చిన రాష్ట్ర విద్యుత్ మరియు అటవీ శాఖల మంత్రి, తన పూర్వ స్నేహితుడు బాలినేని శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందిస్తున్న జిల్లా యూత్‌కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు చిట్టమూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

# కన్నులపండువగా శరన్నవరాత్రి వేడుకలు



- ఏకాంతంగానే ఉత్సవాలు
- ముగిసిన దసరా సంబరాలు

జిల్లావ్యాప్తంగా వేడుకగా జరిగిన శరన్నవరాత్రి ఉత్సవాలు ఈనెల 26తో ముగిశాయి. విజయదశమి పర్వదినాన్ని ప్రజలు సంబరంగా జరుపుకున్నారు. జిల్లాలోని పలు ప్రసిద్ధమైన దేవాలయాల్లో నవరాత్రి ఉత్సవాలు కన్నులపండువగా నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా జగన్మాతకు పూజలు, సేవలు విశేషంగా జరిగాయి. అమ్మవారిని వివిధ అలంకారాల్లో దేదీప్య మానం చేశారు. ప్రత్యేకించి మహిషాసురమర్ధినిగా, శ్రీ రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారి అలంకారాలు శోభాయమానంగా ఉండి భక్తులకు కన్నులపండువ చేశాయి.



రాష్ట్ర ప్రభుత్వం తరపున చెంగాళ పరమేశ్వరి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్ళూరుపేటలోని శ్రీ చెంగాళ పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో నవరాత్రి వేడుకలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ఛైర్మెన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఇ.ఓ ఆళ్ళ శ్రీనివాసులురెడ్డి సారధ్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా చండీయాగం నిర్వ హించారు. అమ్మవారి మహిషాసురమర్ధిని అలంకారానికి రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..టిటిడి పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అదేవిధంగా, పెంచలకోనలో శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో స్వామివారికి..అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. విజయదశమిని పురస్కరించుకుని దేవదేవేరులకు కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. జొన్నవాడలోని కామాక్షమ్మ అమ్మవారి దేవస్థానంలో ఈ వేడుకలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగాయి.

### నగరంలోని ఆలయాల్లో నేత్రపర్వంగా అలంకారాలు :

నెల్లూరు నగరంలోని పలు ఆలయాల్లో ఈ నవరాత్రి వేడుకల్లో భాగంగా అమ్మవార్లకు ప్రత్యేక అలంకారాలు చేసి, విశిష్ట పూజలు చేశారు. భక్తులు ఆలయాలకు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. నగరంలోని దర్గామిట్టలో ఉన్న శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈ ఉత్సవాల చివరిరోజైన ఆదివారం నాడు విజయదశమని పురస్కరించుకుని అమ్మవారికి మహాభిషేకం నిర్వహించారు. అమ్మవారు శ్రీరాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు తంగిరాల రాధాకృష్ణశర్మ సారధ్యంలో ప్రత్యేకపూజలు జరిగాయి. అమ్మవారి భక్తులు, ప్రముఖ దాతలు ఆల్తూరి గిరీష్‌కుమార్‌రెడ్డి-లత దంపతులు, మహేష్‌కుమార్‌రెడ్డి-రాధిక దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ధర్మకర్తల మండలి, ఆలయ అధికారుల సమక్షంలో ఈ వేడుకలు చేశారు. కోవిడ్ నేపథ్యంలో ఉత్సవాలు ఏకాంతంగానే జరిగాయి. అదేవిధంగా రంగనాయకులపేటలోని శ్రీరంగనాథస్వామివారి దేవాలయంలో స్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి సాయంత్రం ప్రాకారోత్సవం చేశారు. స్వర్ణాల చెరువు గట్టున వెలసిన నెల్లూరు గ్రామదేవత ఇరుకళల అమ్మవారి దేవస్థానంలోనూ, మూలాపేటలోని భువనేశ్వరి దేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయంలో, శ్రీకృష్ణ ధర్మరాజస్వామి దేవాలయంలో, నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో, స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలోనూ, పప్పులవీధిలోని శ్రీమహలక్ష్మమ్మ ఆలయం.. ఫత్తేఖాన్‌పేటలోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం, సంతపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవాలయం, వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవాలయం.. తదితర దేవాలయాల్లో విశిష్ట అలంకారాలు, విశేష పూజలు నిర్వహించారు. కోవిడ్ నేపథ్యంలో భక్తులు మాస్కులు ధరించి, నిబంధనలు పాటిస్తూ ఆలయాల్లో వివిధ రూపాల్లో కొలువై ఉన్న ఆ జగన్మాతను దర్శించుకున్నారు.

# డిఏఏసి ఛైర్మెన్‌గా నిరంజన్‌బాబురెడ్డి

జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మెన్‌గా కోవూరు నియోజకవర్గానికి చెందిన వైకాపా నాయకుడు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డిని నియమిస్తూ ఈనెల 28న ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. గతంలో ఆయన కోవూరు ఏఎంసి ఛైర్మెన్‌గా కూడా పనిచేసి ఉన్నారు. ప్రస్తుతం జిల్లా వైకాపా ప్రధాన కార్యదర్శిగా, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి అనుచరునిగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నాడు. ఈ సందర్భంగా తనను డిఏఏసి ఛైర్మెన్‌గా నియమించిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి, అందుకు సహకరించిన ఎమ్మెల్యే ప్రసన్నకు ఆయన తన కృతజ్ఞతలు తెలిపారు.

**వీక్షణం** - మంజీర

## సెలబ్రిటీలూ..!

# మీరూ.. ఈ దేశ పౌరులే!

కళ... కళకోసమే మనుగడ సాగించేది. కళాకారులు కళను ఆరాధిస్తూ జీవికకు మార్గం వేసుకునే వారు. కళాపోషకులు కళను ఆస్వాదిస్తూ కళ కలకాలం బతికి బట్టకట్టడానికి తమవంతు సహకారం అందిస్తూ ఉండేవారు. ఇదంతా రాజుల కాలంలో. సమాజం మారింది. పాలనరీతులు మారాయి. పాలన తీరుతెన్నులు కొత్తపోకడలు పోయాయి. ఇలాంటి పరిస్థితిలో కళారంగం కూడా తనకు తానుగా స్వయం పోషకంగా మారిపోవాల్సిన పరిస్థితి ఎదురైంది. అందుకు పెద్ద ఉదాహరణ సినిమారంగమే. స్వయంపోషకంగా మారడం అనే సొగసైన మాట వెనుక వ్యాపారమయం అనే సున్నితత్వం లోపించిన మరో అర్థం కూడా దాగి ఉంది. కళలు-కళాకారులు, క్రీడలు-క్రీడాకారుల పట్ల సామాన్యజనంలో మోజు ఉండడం సహజం. ఆ మోజును తమ ఉత్పత్తుల ప్రమోషన్ కోసం ఉపయోగించడం మొదలుపెట్టిన తొలి రంగం వ్యాపారరంగం. 'ఈ పేస్ట్‌తో పళ్లు తోముకోండి' అని ఒక సినీ నటుడు చెబితే ఆ టూత్‌పేస్ట్ అమ్మకాల సూచీ ఆకాశాన్ని చూసేది. 'బూస్ట్ ఈజ్ ద సీక్రెట్ ఆఫ్ మై ఎనర్జీ' అంటూ కపిల్‌దేవ్, సచిన్ టెండుల్కర్ బూస్ట్ అమ్మకాలకు మంచి బూస్టప్ ఇచ్చారు. సినీ, క్రీడాతారలు వ్యాపార ప్రకటనలో నటించి నాలుగు డబ్బులు వెనకేసుకుంటున్నారు. వేసుకుంటూనే ఉన్నారు. వాళ్ల సెలబ్రిటీ క్రేజ్‌తో వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవచ్చనే కిటుకును మొదట వ్యాపారరంగం గుర్తించింది. తర్వాత అది రాజకీయరంగానికి విస్తరించింది. ఇప్పుడు ప్రజా ఉద్యమాలు కూడా సెలబ్రిటీలనే ఆసరా చేసుకుంటున్నాయి. దీపికా పదుకోన్ ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ సందర్శనే ఇందుకు పెద్ద ఉదాహరణ.

### దీపిక ప్రచారం

చపాక్ సినిమా లక్ష్మీ అగర్వాల్ అనే యాసిడ్ బాధితురాలి బయోపిక్. నాయిక దీపికాపదుకోన్. జనవరిలో విడుదలైంది. ఆ సినిమా ప్రమోషన్ కోసం జేఎన్‌యూకెళ్లింది దీపిక. ఆ సమయంలో వేర్పాటువాద బృందాలు రెచ్చిపోయాయి. దేశ సమైక్యతకు వ్యతిరేకంగా నినాదాలు పెచ్చరిల్లాయి. అవన్నీ వీడియోల్లో చిత్రీకరణ అయ్యాయి. ఫ్రేమ్‌లో దీపిక కనిపిస్తుంటుంది, అసాంఘిక ఉద్యమకారుల నినాదాలు వినిపిస్తుంటాయి. సంఘటన జరిగిన కొద్ది గంటలకే స్పైస్ పీఆర్ ఏజెన్సీ ఆ వీడియోలను జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థకు అందచేసింది. ఇండియాలో ప్రశాంత వాతావరణం లేదు, ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్రమైన నిరసన పెల్లుబుకుతోందనే సంకేతాలను విజయవంతంగా జారీ చేయగలిగారు. దీని మీద విచారణ జరిపిన కేంద్ర హోమ్‌శాఖకు ఆశ్చర్యకరమైన విషయాలు తెలిశాయి. దీపిక యూనివర్సిటీకి వెళ్లడం, అక్కడి విద్యార్థులు దేశ వ్యతిరేక నినాదాలు పలకడం కాకతాళీయంగా జరగలేదు, దీని వెనుక ఒక వ్యూహం ఉందనే సందేహం వ్యక్తమైంది. లండన్‌లో ఉండే పాక్ మద్దతుదారుడు అనిల్ మస్రత్ పావులు కదిపినట్లు, ఇందుకోసం దీపికకు ఐదుకోట్ల రూపాయలు ముట్టినట్లు కొన్ని ఆధారాలు లభ్యమయ్యాయి. వాటిని నిర్ధారించడానికి లోతుగా దర్యాప్తు జరుగుతోంది.

### తెర మీద తారల కనువిందు

నాగార్జున... కల్యాణ్ జువెలరీని ఘడీ డిటర్జెంట్‌ను ప్రమోట్ చేస్తున్నాడు. వెంకటేశ్ మణప్పురం, రాధిక అట్టికా గోల్డ్ కంపెనీలకు అంబాసిడర్‌లుగా నాలుగు కాసులను వెనకేసుకుంటున్నారు. నాగార్జున ప్రమోట్ చేశాడనే కారణంగా కల్యాణ్ జువెలరీలోనే ఆభరణాలు కొనేవాళ్లుంటారని అనుకోవడానికి వీల్లేదు. అయితే టీవీలో యాడ్ వచ్చినప్పుడు పరిచయం ఉన్న ఫేస్ కనిపిస్తుండడంతో ఆ యాడ్ మీద దృష్టి నిలుపుతారంతే. ఈ యాడ్ నాగార్జునకు డబ్బు చేసిపెట్టడం మినహా సామాన్య జనానికి పెద్ద నష్టం ఉండదు. అలాగే ఘడీ డిటర్జెంట్‌ను నాగార్జున చెప్పాడు కదా అని ఒకసారి వాడటానికి అవకాశం ఉంది. ఆ డిటర్జెంట్ పౌడర్ బాగాలేకపోతే నాగార్జున చెప్పాడని కొనసాగించేవాళ్లు ఉండరు. వినియోగదారుడు కొనసాగేది ఉత్పత్తిలో క్వాలిటీ ఉన్నప్పుడే. అక్షయ్ కుమార్ చెప్పాడని డాలర్ బనియన్ కొనుక్కున్న వ్యక్తి ఆ బనియన్ మన్నిక బాగా లేకపోతే... టీవీలో ఆ యాడ్‌ను చూసిన ప్రతిసారీ అక్షయ్‌కుమార్‌ని కసిదీరా తిట్టుకుంటాడు. మరోసారి డాలర్ బనియన్ కొనడు. అలాగే కపిల్, సచిన్ చెప్పాడని కొన్న బూస్ట్ రుచి పిల్లలకు నచ్చకపోతే ఆ తల్లులు ఏ బోర్నవిటాకో, మాల్టోవాకో మారిపోతారు. వ్యాపార ప్రకటనల ప్రభావం అంతవరకే.

### తారల పాలన

రాజకీయరంగం విషయానికి వస్తే... ఎన్నికల సమయంలో ప్రచారం కోసం వచ్చి పోయే తారలు కొందరు. రాజకీయరంగంలో పూర్తిస్థాయిలో నిమగ్నమైపోయిన తారలు మరికొందరు. అలా వచ్చి ప్రచారంలో తళుక్కున మెరిసి వెళ్లిపోయే తారల పట్ల జనంలో పెద్ద అంచనాలు ఉండవు. ఎన్నికల బరిలో పోటీకి నిలిచిన వాళ్ల విషయంలో మాత్రం జనం సెలబ్రిటీ క్రేజ్ చాలావరకు పనిచేస్తుంటుంది. వాళ్లను సాధారణంగా ఒకసారి గెలిపిస్తారు(పవన్ కల్యాణ్ విషయంలో మాత్రం ఈ లెక్క మొదటిసారి తప్పింది). వాళ్లు తాము ప్రజా ప్రతినిధులమనే విషయాన్ని మర్చిపోయి, ఒక నియోజకవర్గం బాధ్యత తమ మీద ఉందని వాస్తవాన్ని గ్రహించకపోతే... ఆ నియోజకవర్గానికి జరిగే నష్టం ఓ ఐదేళ్ల పాటు వెనకబాటుతనం. ఆ తర్వాత ఎన్నికల్లో అదే జనం మీ సెలబ్రిటీ క్రేజ్ తెర వరకే అని నిర్ధారించేస్తారు.

### తారల కంటే ముందు పౌరులు

ఇవన్నీ కాకుండా మన సెలబ్రిటీలు అదనపు డబ్బు కోసం దేశ సమగ్రతకు, సమైక్యతకు విఘాతం కలిగించే ప్రచారంలో భాగమైతే మాత్రం భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుంది. అంతకంటే పెద్ద అపప్రదను మూట గట్టుకోవాల్సివస్తుంది. ఆ ప్రచారం దేశానికి నష్టం, దేశంలో అందరికీ నష్టం. ఆ ప్రచారంలో పాల్గొన్న సెలబ్రిటీకి కూడా నష్టమే. సెలబ్రిటీలు తమ సెలబ్రిటీ హోదాకంటే ముందు ఈ దేశపౌరులుగా రాజ్యాంగం కల్పించిన హోదాను గౌరవించగలగాలి. అలా చేయలేనప్పుడు దేశద్రోహులనే ముద్రను జీవితకాలం మోయవలసివస్తుంది. 'దేశద్రోహం అనే పెద్ద ఆరోపణలు మామీద మోపవద్దు, ఎప్పుడూ ఏదో ఒక ప్రచారంలో కనిపించడంలో భాగంగానే ఇలా చేశాం' అనేదే వాళ్ల వివరణ కావచ్చు కూడా. అలాంటప్పుడు సమాజ హితం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న పథకాలను ప్రచారం చేయవచ్చు. ఒక పల్స్‌పోలియో చుక్కల ప్రచారం, స్వచ్ఛభారత్, పిల్లలను బడికి పంపించమని చెప్పడం, సామాన్యుడి బతుకుతెరువు కోసం ప్రభుత్వాలు రూపొందించిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి సులువైన వారధిలా మారవచ్చు. అలాంటి ప్రచారం సెలబ్రిటీ హోదాకు మరింత గౌరవం తెస్తుంది. పౌరులుగా సమున్నత స్థాయిలో నిలబెడుతుంది. సెలబ్రిటీగా ధీమాగా తలెత్తుకునే ముందు పౌరులుగా తలదించుకునే పరిస్థితిని తెచ్చుకోకూడదు.

# శ్రద్ధాంజలి



జననం: 18.01.1946

మరణం: 05.11.2017

స్నేహశీలి, మృదుస్వభావి,
మంచి మనసున్న మహామనీషి, మానవతావాది

## ఆదాల రాఘవరెడ్డి గారు

పరమపదించి తేది. 05.11.2020 నాటికి
మూడేళ్ళు పూర్తికానున్న సందర్భంగా
ఆ మానవతామూర్తిని స్మరించుకుంటూ...

వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తున్నాం.

భార్య
**ఆదాల అరుణ**
కుమార్తె
**ఆదాల సాయి అపర్ణ**

కుమారుడు - కోడలు
**ఆదాల వంశీకృష్ణ - రచన**
మనుమరాళ్ళు
**సాయి అనిక, సాయి అవని**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** e-mail: lawyerpatrika@gmail.com